

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 30 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 149 పేజీలు: 4 వెల: రూ 3-00


## కొత్త పిఆర్సీకి అనుగుణంగా జీతాలు

పంతం నెగ్గించుకునే పనిలో ప్రభుత్వం

పార్సీకి వ్యతిరేకంగా విశాఖలో ర్యాలీ

ఉద్యోగుల సమ్మెను వ్యతిరేకిస్తూ పిటిషన్

అమరావతి,జనవరి29(ఆర్ఎన్ఎ): ఉద్యోగులు, పెన్షనర్ల జీతాల విషయంలో తన పంతాన్ని నెగ్గించుకునే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. కొత్త పీఆర్సీకి అనుగుణంగా సీఎఫ్ఎంఎస్‌లో పెన్షన్ స్లిప్పులు జనరేట్ అయ్యాయి. 2018కి ముందు రిటైర్ అయిన వారికి కొత్త పీఆర్సీలో పెన్షన్ ఫిక్స్ అయింది. 70 నుంచి 80 ఏళ్ల మధ్య ఉన్న పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ రద్దు అయింది. కొత్త పీఆర్సీ ప్రకారం 20.02 శాతం డిఏ మంజూరయింది. హెల్త్ అలవెన్స్ 97 రూపాయలు పెరిగింది. అడిషనల్ పెన్షన్‌లో వేల రూపాయలు కట్ చేసి అలవెన్స్‌లో 97 రూపాయలు ముష్టి వేశారంటున్నపెన్షన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెదవి విరుస్తున్నారు. 2018 తరువాత రిటైర్ అయిన వారికి ఐఆర్, డీఏ లేదు. హెల్త్ అలవెన్స్ 397 రూపాయలే పడింది. ఇదిలావుంటే కొత్త పిఆర్సీకి వ్యతిరేకంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విశాఖలో ర్యాలీ చేపట్టింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సిబ్బంది ప్రదర్శనలో పాల్గొన్నారు. తమకు తీరని నష్టాన్ని చేకూర్చే కొత్త పీఆర్సీని రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మాట్లాడుతూ.. 2022 జనవరి నెలకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతో కలిపి పాత జీతాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అశుతోష్ మిశ్రా కమిటీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కొవిడ్ సమయంలో కూడా ప్రాణాలకు తెగించి సేవలందించిన సిబ్బందికి ఇచ్చే కానుక ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఏపీలో పీఆర్సీ వివాదం కొనసాగుతూనే ఉంది. మంత్రుల కమిటీతో చర్చలు జరిపేందుకు ఉద్యోగ సంఘాల నేతలు ముందుకు రాకపోవడంతో అటు మంత్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇటు ఉద్యోగులు మాత్రం వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. శనివారం నుంచి ఆర్టీసీ కార్మికులు నిరాహార దీక్షలు చేస్తున్నారు. పీఆర్సీపై ఉద్యోగుల సమ్మెకు ఆర్టీసీ కార్మికులు మద్దతు ప్రకటించారు. ఫిబ్రవరి 3న చేపట్టిన ఛలో విజయవాడకు ఆర్టీసీ కార్మికులు మద్దతు ప్రకటించారు. అటు ఉద్యోగులతో చర్చలు జరిపేందుకు మంత్రుల కమిటీ ప్రయత్ని స్తున్నా, ఎవరూ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు మంత్రుల కమిటీ సమావేశమైనా ఉద్యోగ సంఘాల నేతలు రావడం లేదు. ఇకపై ఎదురు చూపులు ఉండవని, వాళ్లు వస్తేనే చర్చలని స్పష్టం చేసింది మంత్రుల కమిటీ. చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి బొత్స హెచ్చరించారు. మరోవైపు ఉద్యోగుల సమ్మె నోటీస్‌ను సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సమ్మె నోటీసును రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ప్రకటించాలని పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె సర్వీసు నిబంధనలకు విరుద్ధమని పిటిషన్ పేర్కొన్నారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. విశాఖకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్ సాంబశివరావు ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## ఏపీలో కొత్తగా 11,573 కరోనా కేసులు

అమరావతి: రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి నిలకడగా కొనసాగుతోంది. గత 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 11,573 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ రోజు నమోదయిన కేసులతో కలిపి రాష్ట్రంలో 22,60,181కి కరోనా కేసులు చేరాయి. గడిచిన 24 గంటల్లో కరోనాతో ముగ్గురు మృతి చెందారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా కరోనా వల్ల 14,594 మంది మృతి చెందారు. ఏపీలో 1,15,425 కరోనా యాక్టివ్ కేసులున్నాయి. కరోనా నుంచి కోలుకుని 21,30,162 మంది రికవరీ అయ్యారు.మరోవైపు కరోనా విజృంభిస్తున్న వేళ జిల్లాలో కరోనా పరీక్షలు, వైద్యం ప్రైవేటుగా విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఆర్‌టీపీసీఆర్ పరీక్షల ఫలితాలు తక్షణం రాని పరిస్థితుల్లో వాటి కోసం రెండో రోజు వరకూ వేచి ఉండలేని వారు మాత్రం ర్యాపిడ్ టెస్టులకే మొగ్గు చూపుతున్నారు. ర్యాపిడ్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చిన వారు కొందరు సాంకేతికంగా నిర్ధారణ జరిగే ఆర్‌టీసీపీఆర్ పరీక్షలకు వెళుతున్నా మెజారిటీ సంఖ్యలో మాత్రం ప్రైవేటు వైద్యాన్నే ఆశ్రయిస్తున్నారు.

## ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రకారమే బడ్జెట్ అమలు: బుగ్గన



పొంతన లేని వింత పోలికలు

టీడీపీపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజం

కరోనా ఏడాదిని సాధారణ సంవత్సరాలతో పోల్చడం ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు తలకిందులు

క్లిష్ట సమయంలోనూ పేదల సంక్షేమానికి రూ.1.20 లక్షల కోట్లు

ఫిస్కల్ కౌన్సిల్ అవసరం లేదని కేంద్రమే చెప్పింది

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది టీడీపీ హయాంలోనే

అమరావతి: బడ్జెట్ అమలు కోసం ద్రవ్య మండలి (ఫిస్కల్ కౌన్సిల్) ఏర్పాటు చేయాలన్న విపక్షాల డిమాండ్‌ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తోసిపుచ్చారు. కాగ్, ఆర్థిక సంఘం, గణాంకాల సంస్థలు ఉండగా కౌన్సిల్ అవసరం లేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి పార్లమెం ట్‌లో ప్రకటించడాన్ని గుర్తుచేశారు. కరోనా ఏడాదైన 2020?21ని పదేపదే సాధారణ సంవత్సరాలతో పోలుస్తూ విమర్శలకు దిగటాన్ని తప్పుబట్టారు. కోవిడ్ మహమ్మారితో 2020?21లో ప్రపంచంతోపాటు దేశంలోనూ ఆర్థిక స్థూల ఉత్పత్తి భారీ గా పతనమైందన్నారు.ఇదే క్రమంలో మన రాష్ట్ర ఆర్థిక స్థితి కూడా బాగా దెబ్బతిందన్నారు. 2020? 21లో రాష్ట్ర ఆదాయం సుమారు రూ.8,000 కోట్లు తగ్గిపోగా మరోపక్క కోవిడ్ నియంత్రణ, చికిత్సల కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.7,120 కోట్లు వ్యయం చేసిందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రకారమే బడ్జెట్‌ను అమలు చేస్తున్నామన్నారు. అవాస్తవాలు ప్రచారం చేయటాన్ని ఖండిస్తూ బుగ్గన శుక్రవారం మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలివీ..రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయాలపై టీడీపీ విమర్శలు అర్ధరహితం. 2020 ? 21 తొలి ఆర్నెళ్లలో మూల ధన వ్యయం తక్కువగా చేశారనే విమర్శలు తప్పు. ఇవి గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయి. టీడీపీ హయాంలో మూల ధన వ్యయం ఎంత చేశారో చెప్పాలి. పేదలకు గోరంత ఇచ్చి కొండంత ప్రచారం చేసుకున్న చరిత్ర టీడీపీదే. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు సంక్షేమం కోసం నగదు బదిలీతో రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేసింది. దేశంలో సంక్షేమానికి ఇంత భారీగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం మరెక్కడా లేదు. పేదలకు సంక్షేమ పథకాల వల్ల ద్రవ్యలోటు పెరుగుతుందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు.విద్య, వైద్య రంగాలు నిర్వీర్యంటీడీపీ దృష్టిలో ఆర్థికాభివృద్ధి అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ప్రైవేట్ సంస్థలతో ఎంవోయూలకు పరిమితం కావడమే. వాటితో లేనిది ఉన్నట్లు చూపించి మార్కెటింగ్ చేసుకున్నారు. విద్య, వైద్య రంగాలను నీరుగార్చి వాగ్దానాలను మరిచి మోసగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టిలో ఆర్థికాభివృద్ధి అంటే.. రైతన్నల సంక్షేమం, మూలధన నిర్మాణం, విద్య, వైద్య రంగాల్ని

మెరుగుపరచడం, మహిళా సాధికారత, వికేంద్రీకరణ, పారిశ్రామి కీకరణ, ఉద్యోగాల కల్పన. పేదలు మంచి చదువులు చదివి అన్నిరంగాల్లో ముందుండటం టీడీపీకి ఇష్టం లేదు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కేంద్రంతో సహా ఇతర రాష్ట్రాలు మెచ్చుకుని అక్కడ కూడా అమలు చేస్తుంటే టీడీపీ నేతలకు దిక్కుతోచడం లేదు. గత సర్కారు హయాంలో దివాలా తీసిన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం.

## అమూల్‌కు ప్రమోటర్‌గా ప్రభుత్వం: అచ్చెన్నాయుడు

అమరావతి: రాష్ట్రంలోని పాడి రైతులను గాలికి వదిలేసి అమూల్‌కు ప్రమోటర్‌గా ప్రభుత్వం మారిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. పాడి రైతులకు ఇచ్చిన హామీలు అమలులో వైఫల్యం, అమూల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడంపై సీఎం జగన్‌కు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. పాడి రైతులకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదన్నారు. లీటర్‌కు



రూ.4 బోనస్ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. పాడి రైతులను గాలికి వదిలేసి అమూల్‌కు ప్రమోటర్‌గా మారారన్నారు. అమూల్ పై చూపిస్తున్న శ్రద్ధ పాడి రైతులపై ఎందుకు చూపడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర నిధులతో పాటు ఉపాధి హామీ నిధులను సైతం అమూల్ కోసం దారి మళ్లిస్తున్నారన్నారు. అనంతపురం సభలో అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. రాష్ట్రానికి చెందిన డైయిరీలపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అమూల్ వల్ల లీటర్‌కు రూ.5 నుంచి రూ.20 వరకు అదనంగా లబ్ధి అనేది అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన డైయిరీలను కాదని గుజరాత్ కు చెందిన అమూల్ సంస్థకు ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోందన్నారు. అమూల్ సంస్థపై ఎందుకంత ప్రేమ అని ఆయన ప్రశ్నించారు. అమూల్ కోసం రూ.3 వేల కోట్లు ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సహకార డెయిరీ రంగాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నారన్నారు.

## కేంద్రం వాదన కరెక్టే కానీ ఆ అధికారం రాష్ట్రాలకే?





ప్రధానమంత్రి నరేంద్రమోడీకి సిఎం జగన్ లేఖ

అమరావతి జనవరి 29 కేంద్రం వాదన కరెక్టే కానీ ఆ అధికారం రాష్ట్రాలకే ఉండాలంటు జగన్మోహన్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాశారు. ఆల్ ఇండియా సర్వీసు అధికారుల సర్వీసు నిబంధనల సవరణల విషయంలో కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య వివాదం జరుగుతోంది. కేంద్రంలో పనిచేసేందుకు ఐఎఎస్ అధికారుల కొరత ఎక్కువైపోతోందట. అందుకని రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారులను డిప్యుటేషన్ పై తీసుకునే అధికాలను కేంద్రం తీసుకునేందుకు వీలుగా కొత్తగా నిబంధన రూపొందించింది.ఆ నిబంధన ఏమిటయ్యా అంటే రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఐఎఎస్ లను కేంద్రం అవసరమైపుడల్లా డిప్యుటేషన్ పై పిలిపించుకోవచ్చు. ఇపుడున్న నిబంధన ఏమిటంటే రాష్ట్రప్రభుత్వాలతో సంప్రదింపుల ద్వారా మాత్రమే డిప్యుటేషన్ పై అధికారులు వెళ్ళగలరు. ఒకవేళ ఐఏఎస్ లను డిప్యుటేషన్ పై కేంద్రానికి పంపటానికి రాష్ట్రాలు అంగీకరించకపోతే కేంద్రం చేయగలిగేదేమీ లేదు. అందుకనే ఐఏఎస్ అధికారుల సర్వీసు నిబంధనల్లోనే మార్పులు తేవాలని మోడి సర్కార్ డిసైడ్ చేసింది.సర్వీసు నిబంధనల్లో గనుక సవరణలు జరిగితే ఇకపైన కేంద్రం ఏ ఐఏఎస్ అధికారిని డిప్యుటేషన్ మీద పంపాలంటే రాష్ట్రం పంపాల్సిందే తప్ప వేరే దారిలేదు. సంప్రదింపులు లేవు ఆదేశాలు మాత్రమే ఉంటాయి. ఈ సవరణలపై అభిప్రాయాలు చెప్పమని కేంద్రం అన్నీ రాష్ట్రాలను అడిగింది. అయితే 9 నాన్ బీజేపీ ప్రభుత్వాలు వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పాయి. తమిళనాడు బెంగాల్ ఒడిస్సా ఛత్తీస్ ఘర్ ఝార్ఖండ్ రాజస్ధాన్ తెలంగాణా మహారాష్ట్ర ల సీఎంలు తీవ్రంగా వ్యతిరేకించారు. 8 బీజేపీ పాలిత రాష్ట్రాలు ఎలాగూ మద్దతు తెలుపుతాయి.అందుకనే జగన్మోహన్ రెడ్డి చెప్పే అభిప్రాయం కోసమే మిగిలిన వాళ్ళు చూస్తున్నారు. ప్రధానికి జగన్ రాసిన లేఖలో డిప్యుటేషన్ కోసం సర్వీసు నిబంధనలను మార్చటంపై కేంద్రానికి మద్దతు తెలిపారు. ఇదే సమయంలో ఎవరిని డిప్యుటేషన్ పంపాలనే అధికారం రాష్ట్రాలకే ఉండాలని స్పష్టంగా చెప్పారు. ఎందుకంటే ఐఏఎస్ అధికారుల పనితీరు రాష్ట్రాలకు మాత్రమే తెలుస్తుంది కాబట్టి ఆ అధికారం రాష్ట్రాలకే ఉండాలన్నారు. జగన్ రాసిన లేఖ బాగానే ఉంది. నూరుశాతం కేంద్రాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కాకుండా అలాగని పూర్తిగా సరెండర్ అయిపోయినట్లు కాకుండా ఉంది. తన అభిప్రాయాన్ని చెబుతునే తీసుకురావాల్సిన సవరణలను స్పష్టంగా చెప్పటం మంచిగానే ఉంది. కాకపోతే కేంద్రం ఎంతవరకు పరిగణలోకితీసుకుంటుందో చూడాలి.

## దేశ ద్రోహానికి పాల్పడిన ప్రధాన మంత్రి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ జనవరి 29 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ ద్రోహానికి పాల్పడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. భారత్–ఇజ్రాయెల్ మధ్య 2017లో కుదిరిన ఒప్పందంలో 'పెగాసస్' స్పైవేర్ ఓ భాగమని 'న్యూయార్క్ టైమ్స్'లో ప్రచురితమైన ఓ వ్యాసం వెల్లడించిన నేపథ్యంలో ఆయన ఓ ట్వీట్‌లో ఈ ఆరోపణ చేశారు. "ప్రజలు, ప్రభుత్వ నేతలపై గూఢచర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం పెగాసస్‌ను కొనుగోలు చేసింది. ఫోన్లను ట్యాప్ చేయడం ద్వారా అధికార పార్టీని, ప్రతిపక్షాన్ని, కోర్టును వారు లక్ష్యంగా చేసుకున్నారు. ఇది దేశద్రోహం. మోదీ ప్రభుత్వం దేశద్రోహానికి పాల్పడింది" అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఇచ్చిన ట్వీట్‌లో, మోదీ ప్రభుత్వం భారత దేశానికి శత్రువుగా ఎందుకు వ్యవహరించింది? యుద్ధంలో ఉపయోగించే ఆయుధాన్ని భారతీయులపై ఎందుకు ఉపయోగించింది? అని ప్రశ్నించారు. పెగాసస్‌ను ఉపయోగించి చట్టవిరుద్ధంగా నిఘా పెట్టడం దేశద్రోహమని ఆరోపించారు. ఎవరూ చట్టానికి అతీతులు కాదన్నారు. తాము న్యాయం జరిగేలా చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహమ్మద్ స్పందిస్తూ, రాహుల్ గాంధీతోపాటు భారతీయులపై నిఘా పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం మిలిటరీ గ్రేడ్ స్పైవేర్‌ను ఉపయోగించిందనడానికి ఇది ఎదురులేని రుజువు అని తెలిపారు. దీనికి జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆ కథనంలో ఏముంది?ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2017లో ఇజ్రాయెల్‌లో పర్యటించినపుడు ఇరు దేశాల మధ్య దాదాపు 2 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదిరినట్లున్యూయార్క్ టైమ్స్ ఓ వ్యాసాన్ని ప్రచురించింది. ఈ వ్యాసం పేర్కొంది. అత్యాధునిక ఆయుధాలు, ఇంటెలిజెన్స్ గేర్ అమ్మకం కోసం ఈ ఒప్పందాలు కుదిరినట్లు తెలిపింది. ఈ ఒప్పందాల్లో చాలా ముఖ్యమైనవి పెగాసస్ స్పైవేర్, మిసైల్ సిస్టమ్ అని పేర్కొంది. 'న్యూయార్క్ టైమ్స్' కథనంపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించలేదు.



## చట్టాలు చేయకుండా నిలువరించలేరు




ఆ దిశగా కోర్టులు కూడా ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వలేవు

మూడు రాజధానుల కేసులో హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్య

ముగిసిన పిటిషనర్ల తరఫు న్యాయవాదుల వాదనలు

విచారణ ఫిబ్రవరి 2కి వాయిదా

అమరావతి: చట్టాలు చేయకుండా ప్రభుత్వాన్ని నిలువరించలేరని, ఆ దిశగా కోర్టులు కూడా ఆదేశాలు ఇవ్వలేవని హైకోర్టు స్పష్టం చేసింది. మూడు రాజధానులపై చట్టం చేయకుండా ప్రభుత్వాన్ని నిలువరించాలంటూ పలువురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆ వాదనలపై స్పందించలేమని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. మీ అందరి వాదనలు ప్రభుత్వాన్ని చట్టాలు చేయకుండా ముందే నిలువరించాలని కోరుతున్నట్లు ఉందని, అది ఎలా సాధ్యమని ప్రశ్నించింది. పాలన వికేంద్రీరణ, సీఆర్‌డీఏ రద్దు చట్టాలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాల్లో మనుగడలో ఉన్న అభ్యర్థనలపై పిటిషనర్ల తరఫు న్యాయవాదుల వాదనలు ముగిశాయి.ప్రభుత్వం, సీఆర్‌డీఏ తదితరుల వాదనల నిమిత్తం విచారణను ఫిబ్రవరి 2కి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటి వరకు అమరావతిలో అభివృద్ధి కార్యకలాపాలకు గతంలో ఇచ్చిన యథాతథస్థితి (స్టేటస్‌కో) ఉత్తర్వులు అడ్డంకి కాదంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.పాలన వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ రద్దు చట్టాలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చిన నేపథ్యంలో ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాల్లో ఏ అభ్యర్థనలు మనుగడలో ఉంటాయి? ఏవి నిరర్థకమయ్యాయి తదితర వివరాలను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనం ముందుంచారు. వాటి ఆధారంగా ధర్మాసనం విచారణను కొనసాగించింది.

# సంపాదకీయం

**ఆదివారం 30 జనవరి 2022**

## పెరుగుతున్న అసమానతలు

భారత్?తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయన్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100కు పైగా మిలియనీర్లు తమకు పన్ను విధించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ మేరకు స్విట్జర్లాండ్?లోని దావోస్?లో నిర్వహిస్తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఆన్‌లైన్ సమావేశానికి ఓ బహిరంగ లేఖను పంపారు. ఆర్థిక అసమానతలపై ఆక్స్?ఫామ్ రూపొందించిన నివేదిక అనంతరం వీరంతా ఈ విధంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని అత్యంత సంపన్నులపై పన్ను విధిస్తే సంవత్సరానికి 2.52 ట్రిలియన్ డాలర్లు సమకూరుతాయని.. సంపన్న వ్యక్తులు, లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థల సహకారంతో జరిపిన ఓ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ప్రపంచ నలుమూలల నుంచి తమకు సెకనుకు 15,000 డాలర్లు, అంటే రోజుకు 1.3 బిలియన్ డాలర్ల సంపద పోగుపడుతోందని, అందువల్ల తమపై వెల్త్ టాక్స్విధించాల్సిన అవసరం ఉందని పేట్రియాటిక్ మిలియనీర్లు ట్వీట్ చేశారు. "గత రెండేళ్లలో ప్రపంచం విపరీతమైన బాధలను ఎదుర్కొన్నప్పటికీ, మహమ్మారి సమయంలో మా సంపద పెరిగిందని చాలా మంది అంటున్నారు. ఇప్పటికైనా మాలో కొందరు న్యాయంగా పన్నులు చెల్లిస్తామని చెప్పాలి" అని పేర్కొన్నారు. ఈ లేఖపై సంతకం చేసినవారిలో అమెరికా, కెనడా, జర్మనీ, బ్రిటన్, డెన్మార్క్, నార్వే, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, ఇరాన్‌లకు చెందిన సంపన్నులు ఉన్నారువరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రారంభం సందర్భంగా జనవరి 17న విడుదల చేసిన రెండు ఆక్స్‌ఫామ్ నివేదికలు, ప్రపంచంతోపాటు భారతదేశంలో సంపద, ఆదాయంలో అసమానతల విస్తరణపై పలు వివరాలు వెల్లడించాయి. కోవిడ్ నేపథ్యంలో అపూర్వమైన అసమానతలు పెరిగాయని నివేదికలు పేర్కొన్నాయి. 98 మంది ధనవంతులైన భారతీయులు 555 మిలియన్ల మంది సంపదను (వి657 బిలియన్లు) కలిగి ఉన్నారు. 2021లో వారి సంఖ్య 39 శాతం పెరగడంతో అత్యధిక సంఖ్యలో బిలియనీర్లు ఉన్న దేశాల్లో భారతదేశం మూడవ స్థానంలో ఉంది. 100 మంది సంపన్న భారతీయుల విలువ 775 బిలియన్ డాలర్లు. ఈ క్లబ్ సంపదలో ఐదవ వంతు పెరుగుదల గౌతమ్ అదానీదే. 2021లో భారతదేశంలో 120 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అందులో 92 మిలియన్లు అనధికారిక రంగంలో ఉన్నారు, నిరుద్యోగం రేటు 15 శాతానికి చేరుకుంది. అదే సమయంలో 84 శాతం భారతీయ కుటుంబాలు ఆదాయంలో క్షీణతను చవిచూశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో ఏడాది ప్రతికూల వృద్ధిని చూపే అంచనాలతో, ఆహార అభద్రత కూడా పెరిగింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ 2021 నివేదిక, 'స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్', భారతదేశంలో 200 మిలియన్లకు పైగా ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని పేర్కొంది. ఇది భారతదేశంలో మాత్రమే కాదు, అసమానత అగాధం ప్రపంచం అంతట విస్తరిస్తోంది. మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి ప్రపంచంలోని 10 మంది ధనవంతుల సంపద రోజుకు 1.3 బిలియన్ డాలర్ల చొప్పున 1.5 ట్రిలియన్ డాలర్లకు రెట్టింపు అయిందని ఆక్స్‌ఫామ్ గ్లోబల్ నివేదిక పేర్కొంది. ప్రపంచ జనాభాలో అట్టడుగున ఉన్న 40 శాతం అంటే 3.1 బిలియన్ల జనాభా ఉన్నంత సంపద వారి సొంతం. ఆక్స్‌ఫామ్ గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం, 10 మంది ధనవంతుల కోవిడ్-19 సంపదపై ఒకేసారి 99 శాతం విండ్‌ఫాల్ పన్ను మొత్తం ప్రపంచానికి వ్యాక్సినేషన్ కోసం చెల్లించవచ్చు. వాతావరణ మార్పు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, సామాజిక రక్షణ, చిరునామాను పరిష్కరించడానికి వనరులను అందిస్తుంది. 80 దేశాల్లో లింగ ఆధారిత హింస ఉన్నట్లు నివేదిక తెలిపింది. మార్చి 2021లో ప్రచురించన ప్యూ రీసెర్చ్ నివేదిక ప్రకారం భారతీయ మధ్యతరగతి 2020లో 32 మిలియన్లకు తగ్గిపోయింది. మధ్యతరగతి ప్రజల సంఖ్య 99 మిలియన్ల నుంచి మహమ్మారి తర్వాత మూడింట రెండు వంతులకు పడిపోయింది. అదే సమయంలో, పేదల సంఖ్య, రోజుకు వి2 లేదా అంతకంటే తక్కువ (దాదాపు రూ. 145 లేదా అంతకంటే తక్కువ) సంపాదిస్తున్న వారి సంఖ్య 75 మిలియన్లు పెరిగింది. జనవరి 2020 అంచనా ప్రకారం 4.3 శాతంగా ఉన్న పేదరికం రేటు 9.7 శాతం వద్ద, మొత్తం పేదల సంఖ్య 134 మిలియన్లకు చేరుకోవచ్చని అంచనా. తక్కువ-ఆదాయ శ్రేణిలో ఉన్నవారు, రోజుకు వి2.01?10 (దాదాపు రూ. 145?725) సంపాదిస్తున్నవారు 1.20 బిలియన్ల నుండి 1.16 బిలియన్లకు తగ్గుతారు. అలాగే 2021 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 107 జాబితాలో భారత్ 94 స్థానంలో ఉంది. అయితే 2000లో 38.9, 2006లో 37.5, 2012లో 29.3 తగ్గింది. దక్షిణాసియాలో శ్రీలంక (64, మోడరేట్), నేపాల్ (73, మోడరేట్), బంగ్లాదేశ్ (75, తీవ్రమైనది, కానీ దాదాపు) మరియు పాకిస్తాన్ (88, ఒక స్కోరు 24.6) వారి ప్రజలకు పోషకాహారాన్ని అందించడంలో భారతదేశాన్ని మించిపోయింది. మహమ్మారి సమయంలో మాత్రమే, ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ పేదలకు సహాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇది చాలా కాలంగా మేకింగ్‌లో డిజాస్టర్‌గా మారింది.

## హాట్ టాపిక్ గా రెవెన్యూ అధికారుల తీరు....

తిరుపతి, జనవరి 29, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లాలోని కొందరు రెవెన్యూ అధికారుల తీరు హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గంలోని కొందరు రెవెన్యూ అధికారులపై ఓ రేంజ్‌లో చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారుల నుంచి వీఆర్వో, వీఆర్ఏల వరకు ఎవరకు తోచిన విధంగా వాళ్లు దోచేస్తున్నట్టు గట్టిగానే చెవులు కొరుక్కుంటున్నారు. ఏటా నియోజకవర్గంలో పదుల సంఖ్యలో అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కినా మార్పు లేదు. అప్పట్లో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల భరతం పట్టిన ఏసీబీ అధికారులు.. కిందిస్థాయి ఉద్యోగులపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. తమవరకు ఏసీబీ రాదని అనుకున్నారో.. లేక క్షేత్రస్థాయిలో రాజకీయ అండదండలు ఉన్నాయని భావించారో కానీ.. అవినీతిలో కిందిస్థాయి సిబ్బంది చెలరేగిపోతున్నారట. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్ వన్, గ్రేడ్ టు వీఆర్వోలు 70 మంది వరకు ఉన్నారు. వీరిలో కొందరు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తూ భారీగానే వెనకేసుకుంటున్నట్టు చెబుతున్నారు. వీఆర్వోలకు ప్రభుత్వం జీతం కింద ఇచ్చేదానికంటే.. అనేక రెట్ల అవినీతి సంపాదన వీళ్ల సొంతమట. తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల మండలాల్లో కొందరు వీఆర్వోలు బినామీ పేర్లతో వందల కోట్లు దోచేశారని కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. వీఆర్వోలతో పోటీగా వీఆర్ఏలు చేతివాట ప్రదర్శిస్తున్నట్టు సమాచారం. తిరుపతి, చిత్తూరు జాతీయ రహదారి విస్తరణలో భూముల సేకరణ, పక్కా ఇళ్లు, పట్టదారు పాస్‌పుస్తకాల పంపిణీ రెవెన్యూ అధికారులకు కల్పతరువుగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుక్కలపల్లి-మల్లవరం జాతీయ రహదారి విస్తరణ పనులు ఎఖీలకు కాసుల వర్షం కురిపించినట్టు సమాచారం. భూ సేకరణ పేరుతో లేని భూములకు పట్టాలు సృష్టించి ఆ పట్టాలకు నష్టపరిహారం కింద బినామీల పేర్లతో కోట్లు రూపాయలు కొల్లగొట్టారట. పక్కా గృహాల కోసం సేకరించిన భూములలో సైతం అవకాశం ఉన్నంత వరకు వెనకేసుకున్నట్టు చెబుతున్నారు. డికేటి భూములను ఏ,బీ. సీ కేటగిరీలుగా విభజించిన ప్రభుత్వం మూడు రకాలుగా నష్ట పరిహారం చెల్లించింది. ఇందులో సీ కేటగిరీలో ఉన్న లబ్ధిదారులతో అధికారులు కుమ్మక్కై ఏ కేటగిరి కింద భారీ మొత్తంలో నష్టపరిహారం అందేలా రికార్డులు మార్చేశారట. చంద్రగిరిలో రెవెన్యూ అధికారుల సంపాదన చూశాక.. ఈ ప్రాంతానికి బదిలీపై రావడానికి కొందరు అవినీతి అధికారులు పెద్ద ఎత్తున పైరవీలు చేసినట్టు సమాచారం. అక్కడ పోస్టింగ్ ఇప్పిస్తే.. వచ్చే దాంట్లో వాటా ఇస్తామని బేరం పెట్టేశారట ఇంకొందరు. విషయం ఆ నోటా.. ఈ నోటా బయటకు పొక్కడంతో అవినీతి నిరోధక శాఖ అధికారుల దృష్టికి ఇక్కడి బాగోతం వెళ్లిందట. పైనుంచి కిందిస్థాయి వరకు ఎవరెంత సంపాదించారు? ఎక్కడెక్కడ అక్రమాస్తులు కూడబెట్టారు? బినామీలుగా ఉన్నదెవరో కూపీ లాగుతున్నట్టు సమాచారం. ఈ విషయం అక్రమార్కులకు తెలియడంతో జాగ్రత్తపడుతున్నారట. ముందు జాగ్రత్తగా ప్రజాప్రతినిధుల చెంతకు వెళ్లి.. అభయ హస్తం కోరుతున్నట్టు సమాచారం. అయితే ప్రలోభాలకు లొంగకుండా ఏసీబీ గట్టిగా ప్రయత్నిస్తే.. చంద్రగిరి రెవెన్యూ శాఖలో అవినీతి గుట్టలు గుట్టలుగా బయటపడుతుందని చెబుతున్నారు. మరి.. అక్రమాల అంతు తేలుస్తారో లేక చీకటి హస్తాలకు ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ అంటారో చూడాలి

## అన్నమయ్య చెంతకు చేరిన తప్పని తిప్పలు

కడప, జనవరి 29, (న్యూస్ పల్స్)కొత్త జిల్లాల ఏర్పాటు సంగతి ఏమో కాని అధికార వైసీపీలో మాత్రం ఇప్పుడు పదవుల జ్వరం పట్టుకుంది. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి 151 మంది ఎమ్మెల్యేలు గెలవడంతో ఏ జిల్లాలో చూసినా వారిదే ఆధిపత్యం. దాదాపు అన్ని నియజకవర్గాల్లో వారిదే పైచేయి. అయితే ఇదే సమయంలో కొత్త జిల్లాల ప్రకారమే రాబోయే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈసారి మంత్రి వర్గ విస్తరణలో జగన్ కొత్త జిల్లాల ప్రాతిపదికనే ఇస్తారని అంటున్నారు. దీంతో కొందరు నేతలు ఖుషీ గా ఉంగా మరికొందరు పోటీ ఎక్కువగా ఉంది. ఇందులో ప్రస్తుత చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డికి అదృష్టమో, దురదృష్టమో చెప్పలేం. కడప జిల్లా నుంచి బయటకు వెళ్లినందుకు ఆయనకు ఆనందంగానే ఉండి ఉండవచ్చు. రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పడింది. కడప జిల్లాలో ఉన్నప్పుడు అక్కడ ముఖ్యమంత్రి జగన్ పులివెందుల నుంచి ఉన్నారు. మైనారిటీ కోటా కింద అంజాద్ భాషాకు అప్పగించారు. కడపలో ఉంటే? కడప జిల్లాలోనే ఉంటే జగన్ ముఖ్యమంత్రిగా ఉంటారు కాబట్టి మరో రెడ్డి సామాజికవర్గం నేతకు మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. అయితే ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తునన రాయచోటి అన్నమయ్య జిల్లాలోకి వచ్చేసింది. కొత్తగా ఏర్పడబోయే అన్నమయ్య జిల్లాలో తంబళ్లపల్లి, రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలున్నాయి. అయితే ఇక్కడ కూడా శ్రీకాంత్ రెడ్డికి మనశ్శాంతి లేదనే చెప్పాలి. వరసగా రెండు జిల్లాల్లోనూ రెడ్డి సామాజికవర్గానికి మంత్రి పదవులు దక్కే అవకాశం లేదు. ఇటు కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు వరసగా రెడ్డి సామాజికవర్గానికి పదవులు ఇచ్చే ఛాన్స్ లేదు. అన్నమయ్య జిల్లాలోనూ వైసీపీలో సీనియర్ నేతలున్నారు. మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యేలున్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి గెలిచిన కోరుముట్ల శ్రీనివాసులు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. శ్రీకాంత్ రెడ్డి లాగే జగన్ ను నమ్ముకున్న వ్యక్తి. పైగా ఎస్సీ. ఎస్సీ కోటా కింద ఆయన దక్కించుకునే ఛాన్స్ ఉంది. ఇక పీలేరు నుంచి రెండుసార్లు గెలిచిన చింతల రామచంద్రారెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆయన కూడా రెండుసార్లు గెలిచారు. దీంతో శ్రీకాంత్ రెడ్డి జిల్లా మారినా ఫేట్ మారుతుందా? లేదా? అన్న డౌట్ లోనే ఉన్నారట.

## విశాఖ?చెన్నై పారిశ్రామిక కారిడార్

నెల్లూరు, జనవరి 29, (న్యూస్ పల్స్)రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో కీలకమైన విశాఖ?చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.5,544 కోట్లతో రెండు దశల్లో ఈ కారిడార్ పనులు జరుగుతున్నాయి. తొలి దశ కింద రూ.2,278.61 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను 2023 మార్చి నాటికి పూర్తిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో ఇప్పటికే రూ.815.17 కోట్ల విలువైన పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు తుది దశలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.306.56 కోట్ల విలువైన పనులు పూర్తిచేస్తే.. గడచిన రెండున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.508.61 కోట్ల విలువైన పనులను పూర్తి చేసింది. ఇందులో ఇప్పటికే నాయుడుపేట క్లస్టర్‌లో 1 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి యూనిట్, శ్రీకాళహస్తి?ఏర్పేడు క్లస్టర్‌కు సంబంధించి విద్యుత్ సరఫరా పనులు పూర్తయ్యాయి. నాయుడుపేట, అచ్యుతాపురం క్లస్టర్‌కు సంబంధించి నీటి సరఫరా, విద్యుత్ వంటి కీలక మౌలిక వసతులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేవిధంగా ఏపీఐఐసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.2,599.56 కోట్లతో రెండో దశకు సంబంధించిన పనులను కూడా ఏపీఐఐసీ చేపట్టింది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో ఆసియా అభివృద్ధి బ్యాంకు రూ.4,125 కోట్లు రుణం రూపంలో సమకూర్చనుండగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,419 కోట్లు వ్యయం చేయనుంది. ఈ ప్రాజెక్టు కింద విశాఖ నోడ్‌లో నక్కపల్లి వద్ద 4,316 ఎకరాలు, రాంబిల్లి వద్ద 2,532 ఎకరాలు, చిత్తూరు సౌత్ బ్లాక్ నోడ్‌లో 13,319 ఎకరాలు, వైఎస్సార్ జిల్లా కొప్పర్తి వద్ద 2,596 ఎకరాలను పారిశ్రామిక అవసరాల కోసం అభివృద్ధి చేస్తున్నారు. ఒక్కసారి వీసీఐసీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తి ఏడు రెట్లు, రాష్ట్ర జీడీపీ ఆరు రెట్లు పెరుగుతుందని అంచనా. 2015లో రూ.1.11 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర తయారీ రంగ ఉత్పత్తి 2035 నాటికి రూ.7,82,300 కోట్లకు, రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.11.60 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. అదనంగా 1.10 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని అంచనా

## ఏపీ ప్రభుత్వం చేస్తున్న అప్పుల కుప్పలు

అమరావతి జనవరి 29 ఏపీ ప్రభుత్వం అప్పులు చేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు.. ఈ అప్పులు తెచ్చిన సొమ్మును ఏం చేస్తున్నారంటే.. ఇదిగో అమ్మ ఒడికి ఇచ్చాం.. సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం.. కనిపించడం లేదా? అని మంత్రుల నుంచి నిప్పులు చెరిగే విమర్శలు వస్తున్నాయి. పోనీ.. ఎక్కడ నుంచి అప్పులు తెస్తున్నారు? అంటే.. దీనికి కూడా సరైన సమాధానం లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారంటూ.. విమర్శలు వచ్చినా.. పట్టింపు లేదు. పైగా ఎదురు దాడి లేకుండా.. పోలీసుల దాడి! అన్నట్టుగా మారిపోయింది పరిస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే.. కష్టమని అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు. మేధావులు అయితే.. అసలు ఈ అప్పుల లెక్కలేంటి? వీటిని ఎలా తీరుస్తారు? అనే విస్మయాలు సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ.. సర్కారు మాత్రం నిర్భయంగా.. నిత్యం అప్పు చేసి పప్పు కూడు! అనే తరహాలో చిద్విలాసంగా రోజులు నెట్టుకొస్తోందనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. ఒకవైపు ప్రతిపక్షాలు.. మరోవైపు మేధావులు ఎన్ని

సూచనలు చేస్తున్నా.. ఎన్ని విమర్శలు సంధిస్తున్నా.. ఏమాత్రం భేషజం లేకుండా.. సర్కారు తన అప్పుల ముందు చూపును మరింతగా ముందుకు సారిస్తూ.. అందిన కాడికి అప్పు చేస్తూ.. పాలన చేస్తోందిఇక కేవలం 32 నెలల్లో ఏపీ ప్రభుత్వం చేసిన అప్పు ఎక్కువగా ఉందని మేధావులు ఆర్థిక నిపుణులే కాదు.. కేంద్ర ఆర్థిక శాఖ కూడా విమర్శలు చేస్తోంది. 2019లో వైసీపీ అధకారంలోకి రాకముందు అప్పటి వరకు ఉన్న అన్ని ప్రభుత్వాలు(ఉమ్మడి ఏపీ కలిపి) 3.14 లక్షల కోట్ల అప్పులు చేశాయి. వాటిని కూడా ఆచి తూచి ఖర్చు చేశాయి. అంతేకాదు.. ఏ అప్పు దేనికి చేశామో కూడా చెప్పుకొచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం 32 నెల్లలో 3.64 లక్షల కోట్ల అప్పులు చేసింది. అయితే.. ఈ సొమ్మును ఏం చేశారు? అంటే.. మాత్రం పెదవి విరుపులే కనిపిస్తున్నాయి. ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదు. సో.. ఇదీ పరిస్థితి. ఈ నేపథ్యంలో అసలు ఏపీ ఎక్కడెక్కడ నుంచి ఇంత అప్పులు తెచ్చిందనే విషయం ఆసక్తిగా మారింది. ఆ వివరాలు ఇవీ..

| సంస్థ | అప్పు తెచ్చిన మొత్తం(కోట్లలో) |
| --- | --- |
| ఎస్డీఎల్స్ | 229317.60 |
| ఉదయ్ | 8256 |
| కాంపెన్సేషన్ బాండ్లు | 1500.10 |

**ఉమ్మడి ఏపీ లో 3.14 లక్షల కోట్ల అప్పులు**

**వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 32 నెల్లలో 3.64 లక్షల కోట్ల అప్పులు**

| | |
| --- | --- |
| ఎన్ ఎస్ ఎస్ ఎఫ్ | 10158.40 |
| ఎల్ ఐసీ నుంచి రుణం | 41.90 |
| జీఐసీ నుంచి రుణం | 16 |
| నాబార్డు | 6800.40 |
| ఎన్సీడీసీ రుణం | 99.40 |
| ఇతర సంస్థల నుంచి | 101.30 |
| కేంద్రం నుంచి రుణం | 21711.80 |
| పీఎఫ్ | 22878 |
| రిజర్వ్ ఫండ్ | 3140.20 |
| డిపాజిట్ అడ్వాన్సులు | 62745.40 |
| కంటింజెన్సీ ఫండ్ | 50 |
| మొత్తం | 360333.40 లక్షల కోట్లు |

## మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని..

### భార్యను హతమార్చిన భర్త

గూడూరు జనవరి 29, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెం లో సూరిపాక ప్రకాష్ అతని భార్య పుష్ప నివసిస్తున్నారు. వీరిద్దరూ మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ప్రకాష్ మద్యానికి బానిసై సక్రమంగా పనికి వెళ్లకపోవడంతో విధుల నుంచి తప్పించారు. భార్య పుష్ప పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. గత రాత్రి మద్యం తాగడానికి డబ్బులు కావాలని భార్యతో గొడవ పడ్డాడు. పనికి వెళ్లకుండా మధ్యాహ్నా కి బానిసై ఆరోగ్యం చెడిపోతుందని భార్య వాదించడంతో కోపంతో ఇనుప రాడ్తో తల మీద కొట్టడంతో తల పగిలి పుష్ప మృతి చెందింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నాగేశ్వరమ్మ,ఎస్సై పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## గుంటూరులో ఫ్లెక్సీ గోల

గుంటూరు, జనవరి 29, (న్యూస్ పల్స్)పగలు, ప్రతీకారాలతో రగిలిపోయే పల్నాడు లో సరికొత్త వివాదం రాజుకుంది. ఫ్లెక్సీల ఏర్పాటుపై వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ నేతలు బాహాబాహీలకు దిగుతున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుండటంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. మాచర్లలో ప్రారంభమైన ఫ్లెక్సీల వివాదం నర్సరావుపేట నియోజకవర్గానికి పాకింది. మాచర్ల ఇంఛార్జ్ గా బ్రహ్మారెడ్డి నియామకం తర్వాత మాచర్లలో టీడీపీ అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే అదే రోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను చించి వేశారు. వైసీపీ కార్యకర్తలే చించి వేశారంటూ టీడీపీ ఆందోళనకు దిగింది. ఆ తర్వాత నర్సరావుపేట మండలం కేశానుపల్లిలో టీడీపీ వైసీపీ వర్గాల మధ్య ఫ్లెక్సీలు ఏర్పాటు తీవ్ర వివాదానికి కారణమయ్యాయి. ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా కేశానుపల్లిలో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను తగల బెట్టారు. దీంతో సచివాలయం అధికారులు ఫ్లెక్సీలు తొలగించాలని అదేశాలు జారీ చేశారు. అయితే టీడీపీ ఫ్లెక్సీలు మాత్రమే తొలగించాలనడంపై టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగటంతో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. వెల్దుర్థి మండలం గుండ్లపాడులో 13 తేదిన టీడీపీ కార్యకర్త చంద్రయ్య హత్య జరిగింది. ఆయన దశ దిన కర్మల సందర్భంగా గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలు చించడంతో గ్రామంలో మరోసారి వివాదం రాజుకుంది. రెండు వర్గాలు ఘర్షణకు దిగటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇలా పల్నాడులో పలు చోట్ల ఫ్లెక్స్ ల ఏర్పాటు రెండు పార్టీల మధ్య వివాదాలకు కారణమవుతున్నాయి. ఫ్లెక్సీల ఏర్పాటుతో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుండటంతో పోలీసులు ఇరు పార్టీలకు పలు సూచనలు చేస్తున్నారు. వివాదం తలెత్తే అవకాశం ఉన్న చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా పలు చోట్ల నాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

## జగన్ మార్క్...

విజయవాడ, జనవరి 29, (న్యూస్ పల్స్)జగన్ పారిశ్రామికవేత్తమాత్రమే కాదు. మంచి రాజకీయ వేత్త కూడా. ఫ్యూచర్ పాలిటిక్స్ ను దృష్టిలో పెట్టుకునే జగన్ ఏ నిర్ణయమైనా తీసుకుంటారన్నది ఆయనను దగ్గరగా చూసే వ్యక్తులు చెప్పే విషయం. జగన్ ఎవరి మాట వినడంటారు. ఏ నిర్ణయం తీసుకున్నా సొంత నిర్ణయమే ఉందంటారు. కానీ అది తప్పు. జగన్ తీసుకునే ప్రతి నిర్ణయం వెనక ఒక వ్యూహం ఉంటుంది. ఇప్పుడు కొత్త జిల్లాల ఏర్పాటు మాత్రమే కాకుండా ఎన్టీఆర్ ను సొంతం చేసుకునే ప్రయత్నం చేశాడన్నది వాస్తవం. చంద్రబాబు ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ ను చంద్రబాబు గత రెండు దశాబ్దాలుగా సైడ్ చేశారు. ఎన్టీఆర్ కు ఈతరం కాకపోయినా పాతతరంలో లక్షల సంఖ్యలో అభిమానులున్నారు. ప్రధానంగా కమ్మ సామాజికవర్గంలో మాత్రమే కాకుండా వెనుకబడిన ముఖ్యంగా బీసీల్లో ఆయనకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కానీ ఎన్టీఆర్ ను చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ఉన్న పద్నాలుగేళ్లలో ఎప్పుడూ పట్టించుకోలేదన్నది ఆ పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శ. గతంలో సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి నేతలు ఎన్టీఆర్ ను సైడ్ చేయడంపై విమర్శలు చేశారు. వర్థంతి, జయంతి, మహానాడు సందర్భంగా ఆయనకు ఒక పూలదండ వేయడం తప్ప చంద్రబాబు ఎన్టీఆర్ కోసం చేసిందేమీ లేదని, ఆయనను బాబు ఇప్పటికీ విలన్ గానే చూస్తున్నారని పార్టీ నేతలే ఒప్పుకుంటారు. ఇక జగన్ మాత్రం అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్మ సామాజికవర్గంపై కక్షకు దిగారన్న ఆరోపణలు విన్పించాయి. కమ్మ సామాజికవర్గం వారిని ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు విన్పించాయి. చివరకు జనసేనాని పవన్ కల్యాణ్ సయితం కమ్మ సామాజికవర్గంపై జగన్ ప్రభుత్వం దాడి చేస్తుందని మండి పడ్డారు కూడా. అయితే వాటన్నింటి నుంచి బయటపడేందుకు జగన్ ఎన్టీఆర్ పేరు జిల్లాకు పెట్టారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కమ్మ సామాజికవర్గంలోనే జగన్ ను ఈ విషయంలో మెచ్చుకుంటుండటం గమనార్హం. చంద్రబాబు చేయలేని పనిని జగన్ చేశారన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. ఎన్టీఆర్ పేరు పెట్టడంపై నందమూరి కుటుంబం నుంచి కూడా ఎలాంటి రెస్పాన్స్ లేదు. భువనేశ్వరిపై అసెంబ్లీలో జరిగిన ప్రస్తావన, ఆ తర్వాత చంద్రబాబు ఏడ్వడటం వంటి వాటిని జగన్ ఒక్క యార్కర్ తో కొట్టేశారంటున్నారు.

## ఎవ్వరికి పట్టని స్టీల్ ప్లాంట్ ...?

విశాఖపట్టణం, జనవరి 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయ నేతల గురించి.. పార్టీల గురించి పాపం కార్మికులకు, రైతులకు పెద్దగా అవగాహన ఉన్నట్లు లేదు. తమకు అవసరం ఉన్న సమయంలోనే వారు అండగా నిలుస్తారు. లేదంటే సైడయి వెళ్లిపోతారు. అమరావతి రాజధాని ఉద్యమాన్ని కూడా అన్ని పార్టీలూ అలా పైకి లేపి, చివరకు వారి మానాన వారిని వదిలేశాయి. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల పరిస్థితి కూడా అంతే. వచ్చే నెల 12వ తేదీ నాటికి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసన చేపట్టి ఏడాది కావస్తుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు వ్యతిరేకంగా తొలినాళ్లలో అన్ని పార్టీలు గట్టిగానే మద్దతిచ్చాయి. వైసీపీ కార్మికులకు మద్దతుగా విశాఖపట్నంలో పాదయాత్ర చేసింది. ఇక టీడీపీ అయితే ఏకంగా ఆమరణ దీక్షకు దిగింది. ఆ పార్టీ నేత పల్లా శ్రీనివాసరావు స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించవద్దంటూ ఆ పార్టీ నేత పల్లా శ్రీనివాసరావు దీక్షకు దిగితే స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు వెళ్లి పరామర్శించి వచ్చారు. ఇక జనసేన పార్టీ గురించి చెప్పాల్సిన పనిలేదు. పవన్ కల్యాణ్ కార్మికులకు అండగా విశాఖ వెళ్లి దీక్షలో పాల్గొన్నారు. అంతేకాదు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న వ్యవహారాన్ని నిరసించారు. వెంటనే దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ మంగళగిరి పార్టీ కార్యాయంలో ఎనిమిది గంటల పాటు ఆయన దీక్షకు దిగి స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అయితే ఇదంతా కేవలం రాజకీయాల కోసమే మూడు పార్టీలూ చేస్తున్నాయి. అధికార వైసీపీ కేంద్ర ప్రభుత్వంతో దీనిపై ఎటువంటి చర్చలు జరపలేదు. జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాను కలిసినా ఈ విషయాన్ని ప్రస్తావించలేదంటారు. ఇక బీజేపీలో మిత్రపక్షంగా కొనసాగుతున్న జనసేన కూడా బీజేపీ పెద్దలను కలిసే ప్రయత్నం చేయలేదు. ఇక తెలుగుదేశం పార్టీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ప్రశ్నించే సాహసం చేయలేకపోతుంది. పాపం కార్మికులే ఏడాదిగా ప్లాంట్ ను రక్షించుకోవడం కోసం పోరాడుతున్నారు. ఆరాటపడుతున్నారు. ఈ రాజకీయ పార్టీలు మాత్రం వారిని ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయన్నది వాస్తవం. వచ్చే నెల 23న విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చారు.

# ఏపీలో ఆగని జిల్లాల లొల్లి

విజయవాడ, జనవరి 29, (న్యూస్ పల్స్ః)ఎక్కడ కెలికినా ఓకే. సెంటిమెంట్లను మాత్రం కెలక్కూడదంటారు అనుభవజ్ఞులు. సెంటిమెంట్లు గాయపడితే సెంటు భూమి కోసమైనా వెనక్కి తగ్గదు ప్రజానీకం. ఇప్పుడదే జరిగింది నర్సాపురంలో పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తగా ఏర్పాటవుతున్న నర్సాపురం జిల్లాకు భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించడంపై నర్సాపురం ప్రజలు భగ్గుమన్నారు. నర్సాపురం పేరుతోనే జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని లేకపోతే ఊరుకునే సమస్యే లేదని అక్కడి వ్యాపార-వాణిజ్య వర్గాలు, సామాన్య ప్రజలు బంద్ కు పిలుపునిచ్చారు. స్థానిక రాజకీయ నాయకులు ప్రజాభిప్రాయంతో రంగంలోకి దిగారు. జిల్లా కేంద్ర సాధన పేరుతో అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసుకొని నర్సాపురం నియోజకవర్గం మొత్తం శుక్రవారం బంద్ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని వర్తక వాణిజ్య, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాయి.ఏపీలో కొత్త జిల్లాల పేర్ల విషయంలో స్థానికంగా వివాదాలు మొదలయ్యాయి. నియోజకవర్గాల సర్దుబాటు, కూడికలు, తీసివేతలు, దూరాభారాలు, కులం కొట్లాటలు, ఆస్తుల పంపకాలు, రాజకీయ కుట్రలు, కుతంత్రాలు ఇలా అన్ని రకాలుగా తేనెతుట్టె కదిలింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆందోళనలు జరుగుతున్నాయి. నిజానికి నర్సాపురాన్ని జిల్లా కేంద్రంగా కాకుండా భీమవరాన్ని ప్రకటించడంలోని ఔచిత్యాన్ని ముందుగా మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ప్రశ్నించారు. జిల్లా కేంద్రం విషయంలో నర్సాపురం ప్రజలు, రాజకీయ నాయకులు ఓడిపోయారని, భీమవరం ప్రజలు, రాజకీయ నేతలు గెలిచారంటూ వ్యాఖ్యానించారు. భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించిన జగన్ రెడ్డి సర్కార్ ఏ కులాన్ని సపోర్ట్ చేస్తున్నారో స్పష్టంగా తెలిసిపోయిందంటూ నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే. మరో పక్కన ఇప్పటి వరకు ఉన్న తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తగా ఏర్పాటయ్యే ఏదో ఒక జిల్లాకు దళితజన బాంధవుడు బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలనే డిమాండ్ ను దళితులు తెర మీదకు తెచ్చారు.ఇక విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లాను ప్రకటించడంపైనా విమర్శలు వస్తుండడం గమనార్హం. ఎందుకంటే.. నందమూరి తారక రామారావు పుట్టింది పామర్రు మండంలోని నిమ్మకూరు గ్రామం. కొత్త జిల్లా ఏర్పాటు ప్రకారం ఆ గ్రామం ఇప్పుడు మచిలీపట్నం జిల్లాలోకి వస్తుంది. నిజంగా ఎన్టీఆర్ పట్ల జగన్ రెడ్డి సర్కార్ కే కనుక గౌరవం, అభిమానం ఉంటే మచిలీపట్నం జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టకుండా విజయవాడ జిల్లాకు పెట్టడంలో ఔచిత్యాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఎన్టీఆర్ కుమార్తె, బీజేపీ నేత దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేస్తుండడాన్ని స్వాగతించారు. అయితే.. దీని వెనుక జగన్ రెడ్డి రాజకీయ వ్యూహం ఏదో ఉండి ఉంటుందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పైకి ఎన్టీఆర్ ను గౌరవించినట్లు ఉన్నా.. జగన్ రెడ్డి మాటలు, చేతలు జనం నమ్మేలా లేవని అన్నారాయన.కొత్త జిల్లాల ప్రకటనతో జగన్ రెడ్డి నేమ్ గేమ్ ఆడుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పాడేరుకు అల్లూరి సీతారామరాజు జిల్లా అని, పుట్టపర్తి ప్రాంతానికి శ్రీ సత్యసాయి జిల్లా అని, రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా, తిరుపతి కేంద్రంగా శ్రీ బాలాజీ జిల్లా అని కొత్త పేర్లతో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి రాజకీయంగా ప్రయోజనం పొందాలనే స్కెచ్ ను జగన్ రెడ్డి వేశారని అంటున్నారు. వైఎస్సార్ కడప జిల్లా అని గతంలో పెట్టిన పేరును పూర్తిగా తుడిచిపెట్టిన జగన్ రెడ్డి సర్కార్ కడప ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిచెందిన వీరబ్రహ్మేంద్ర స్వామి పేరును విస్మరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.అలాగే.. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కొన్ని గ్రామాలు, మండలాలకు జిల్లా కేంద్రాలు వందల కిలోమీటర్ల దూరం అయిపోతున్నాయి. దీంతో కొత్త జిల్లా పరిధిలోకి వెళ్లిన ప్రాంతాల వారు ఇదేమి చోద్యం అని ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త జిల్లాలు, చిన్న జిల్లాల ఏర్పాటును బీజేపీ ఏపీ చీఫ్ సోము వీర్రాజు సమర్థిస్తూనే.. కొత్త జిల్లాల్లో విలీనం చేసే ప్రాంతాలు, ప్రధాన కార్యాలయాల ఎంపిక, పేర్లకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణకు కమిటీ వేయాలని సూచిస్తున్నారు. తిరుపతి కేంద్రంగా శ్రీ బాలాజీ జిల్లాగా పేరు పెట్టడాన్ని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు ప్రశ్నించారు. ఉత్తర భారతంలో బాలాజీ అంటే ఆంజనేయస్వామిగా భావిస్తారంటున్నారు. బాలాజీ ఆంధ్రుల సంస్కృతి కాదని, తిరుపతి జిల్లాకు శ్రీ వేంకటేశ్వర జిల్లా అని పేరు పెడితే బాగుంటుందంటున్నారు.విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెట్టడంపై కొన్ని వర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తం అవుతోంది. విజయవాడ కేంద్రంగా వంగవీటి రంగా జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వస్తున్న నేపథ్యంలో మంత్రి పేర్ని నాని స్పందించడం విశేషం. అలాంటి డిమాండ్ మెజారిటీ ప్రజల నుంచి వస్తే పరిగణనలోకి తీసుకుంటామని ఆయన చెబుతున్నారు. అయినా.. అలాంటి డిమాండ్ ను జగమొండి సర్కార్ నిజంగా పరిగణనలోకి తీసుకుంటుందా? అనే అనుమానాలు పలువురిలో లేకపోలేదు. పరిపాలన వికేంద్రీకరణ పేరుతో కొత్త జిల్లా ఏర్పాటును అర్ధరాత్రి ప్రకటించడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామకృష్ణరాజు. కేబినెట్ లో చర్చించకుండానే అకస్మాత్తుగా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రకటన ఎలా చేస్తారనేది ఆయన ప్రశ్న.ఈ నేపథ్యంలోనే ఏపీ ప్లానింగ్ విభాగం కార్యదర్శి విజయ్ కుమార్ తెరమీదకు రావడం.. సీఎం జగన్ ప్రణాళికను, ఆయన పవిత్ర ఆశయాన్ని కూడా వివరించడం కూడా ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. విజయ్ కుమార్ వివరణ విన్న వారికి పాత అనుమానాలు తీరక పోగా జగన్ నిర్ణయం వెనుక ఏ కుట్ర దాగి ఉందో అనే సందేహాలే ఎక్కువయ్యాయంటున్నరు రాజకీయ విశ్లేషకులు. అసలు కొత్త జిల్లా చిచ్చు రాజేయడమే జగన్నాటక సూత్రధారి మహా కుట్ర అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త జిల్లాలు, కొత్త సమీకరణలు, పరిపాలన, రాజకీయ, భౌగోళిక అంశాలపై తీవ్ర ప్రభాం చూపే కీలకమైన జిల్లాల ఏర్పాటు ప్రక్రియను అర్ధరాత్రి తంతుగా వైసీపీ మార్చడంపైన కూడా విమర్శలు వస్తున్నాయి.నర్సాపురం ప్రజలు, వర్తక వాణిజ్య సంఘాలు, విద్యా సంస్థలు ఇప్పుడు నేరుగా ఆందోళనలోకి దిగారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని చోట్ల ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు పేరుతో ఏపీ వ్యాప్తంగా కులాలు, ప్రాంతాలు, వర్గాలు, ప్రజల మధ్య చిచ్చు పెట్టి, చలి కాచుకుందామనే వ్యూహం ఉందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

# మద్యం మత్తులో వీరాంగం

**ఇద్దరు మృతి..మరికొందరికి గాయాలు**

శ్రీకాకుళం జనవరి 29, (న్యూస్ పల్స్ః) శ్రీకాకుళం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఎచ్చెర్ల మండలం ముద్దాడపేట లో సొంత కుటుంబ సభ్యులపై రీసు అప్పన్న అనే వ్యక్తి విచక్షణారహితంగా కత్తితో దాడి చేసాడు. ఈ ఘటనలో అప్పన్న భార్య అక్కమ్మ, ఆయన సోదరి చెల్లుబోయిన రాజు అక్కడికక్కడే మృతిచెందారు. నిందితుని తండ్రి,మరో ఇద్దరి కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులపై దాడి చేసిన అనంతరం నిందితుడు అప్పన్న కత్తితో పొడుచుకున్నాడు. నిందితుడు అప్పన్న కళ్ళు గీత కార్మికుడు. రక్తపు మడుగులో అప్పన్న కుటుంబం ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులు కు సమాచారం ఇచ్చారు. కుటుంబ కలహాలు నేపథ్యం ఈ ఘటనకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. మద్యం మత్తులో అప్పన్న కత్తితో వీరంగం సృష్టించినట్టు సమాచారం...

# కోటప్ప కొండకు పాదయాత్ర

గుంటూరు జనవరి 29, (న్యూస్ పల్స్ః)గుంటూరు జిల్లా నరసరావుపేట లో శివునిబొమ్మ నుండి కోటప్పకొండ వరకు పాదయాత్ర ప్రారంభమయింది. పలనాడు జిల్లా గా నరసరావుపేటను ప్రకటించినందుకు సంఘీభావంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి కోటప్పకొండ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్రకు నరసరావుపేట పట్టణ ప్రజలు, అన్నిరంగాల వ్యాపారస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు...

# సోము వీర్రాజు మాటలను వక్రీకరించారు

**- ప్రొద్దుటూరు బీజేపీ నాయకులు**

ప్రొద్దుటూరు జనవరి 29, (న్యూస్ పల్స్ః)బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు 2 రోజుల క్రితం హత్యా రాజకీయాలు చేస్తున్న నాయకులు గురించి మాట్లాడితే ఆ మాటలను వైసిపి నాయకులు వక్రీకరించారని ప్రొద్దుటూరు బీజేపి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యమంత్రి స్వయానా బాబాయే అయిన వివేకానంద రెడ్డి హత్య సంబంధించి బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడితే దాన్ని వక్రీకరించి జిల్లా ప్రజలందరినీ అన్నారని వైసిపి నాయకులు మాట్లాడటం సరికాదని శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఈ విషయంపై ఎవరు ప్రశ్నించినా వైసిపి నాయకులు తీవ్రపదజాలంతో ఎదురుదాడికి దిగుతున్నారని అని అన్నారు. ప్రొద్దుటూరులో తిపొ సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని చూసిన ఓం రాచమల్లు తీరుపై గతంలో సోము వీర్రాజు, బిజెపి నాయకులు పోరాటంతోనే విగ్రహం ఏర్పాటు చేయకుండా చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉంది రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నాలుక కోస్తా అని మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. చేతనైతే వైసీపీ మంత్రి కొడాలి నాని మాట్లాడే బాష ను సరిచేయాలని తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు చేస్తున్న కోట్ల రూపాయల దానధర్మాలు కేవలం పబ్లిసిటీ కోసమే చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు

# ప్రియురాలు మోసం చేసిందని..సెల్ఫీ ఆత్మహత్య చేసుకున్న ప్రియుడు

కాకినాడ తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం మాగం కొప్పిశెట్టివారి పాలెం లో విషాదం నెలకొంది. ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఓ యు వకుడు నిండు ప్రాణాన్ని తీసుకున్నా డు. సూసైడ్ చేసుకోవడానికి ముందు యువకుడు తీసిన సెల్ఫీ వీడియో కలకలం రేపుతోంది. ఇప్పుడు జిల్లాలో ఈ వీడియో వైరల్గా మారింది. అయి నవిల్లి మండలం మాగం కొప్పిశెట్టివారి పాలెం వాసి కొప్పిశెట్టి శంకరరావు అనే యువకుడు ఆత్మహత్య తూర్పుగోదావరి జిల్లాలోనే సంచలనంగా మారింది. తాను ఓ అమ్మాయిని ప్రేమించి మోస పోయానంటూ సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమపేరుతో తన వద్ద నుంచి భారీగా డబ్బులు, బంగారం తీసుకుని ఇప్పుడు వేరే పెళ్ళి చేసుకుంటుందని శంకరరావు సెల్ఫీ వీడియోలో చెప్పాడు. ఈ విషయాన్ని అందరికీ చెప్పేందుకు వాట్సాప్గ్రూప్లు క్రియేట్ చేసి అన్ని గ్రూప్లో కూడా ఆ అమ్మాయితో క్లోజ్గా ఉన్న ఫొటోలు వీడియోలు షేర్ చేశాడు. ఉంగరాలు మార్చుకున్న వీడియో కూడా షేర్ చేశాడు. శంకరరావుకు ఇప్పటికే పెళ్లి అయింద న్న ప్రచారం సాగుతోంది. ఆ అమ్మా యిని కూడా ప్రేమించి పెళ్లి చేసుకున్నా డని.. ఇప్పుడు వాళ్లిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారని ఆమెతో విడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. మొదటి భార్యతో విభేదాలు ఉన్న పరిస్థితుల్లో ఈ అమ్మాయికి కనెక్ట్ అయినట్టు తెలుస్తోంది.భార్య ఉందన్న విషయాన్ని చెప్పకుండానే ఈ అమ్మా యిని ప్రేమించాడని.. ఈ విషయం తెలిసిన తర్వాత అమ్మాయి వేరే పెళ్లికి ఒప్పుకుందని కూడా స్థానికులు అంటున్నారు. ఎవరి వాదన ఎలా ఉన్నా ఇప్పుడు నిండు ప్రాణం పోవడం ఊరిలో తీవ్ర విషాదం నింపింది. వీళ్లిద్దరు క్లోజ్గా ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్గా మారాయి. సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి.

# పాత జీతాలే ఇవ్వాలి..

**రిలే దీక్షలో పాల్గొన్న ఉద్యోగ నేతలు**

అమరావతి ప్రభుత్వంతో చర్చలకు రావాలంటే ముందుగా నివేదిక బయటపెట్టి, జీవోలను పక్కనపెట్టి పాత జీతాలు వేయాలని ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేస్తున్నట్లు రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వంతో చర్చలకు తాము పెట్టిన కండిషన్లకు ఏ మాత్రం సంబంధం లేదని తెలిపారు. జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద నూతన పి ఆర్ సి కి వ్యతిరేకంగా పిఆర్సి సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలో బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివేదిక లేకుండా కొత్తజీవితాలు ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలా ఇచ్చిన జీతాలు చెల్లవు అన్నారు. చర్చలకు రావడంలేదని, చర్చలకు వచ్చి ఉంటే పాత జీతాలు వచ్చి ఉండేవేమో అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్న వ్యాఖ్యలను ఖండించారు. చర్చకు వచ్చిన ఉద్యోగుల్ని అవమాన పరచడం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. ఎందుకు ఆ స్థాయిలో ఉండి అబద్దాలు ఆడుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులు వెనుక ఈ శక్తులు పని చేయడం లేదని, కేవలం 13 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన పోరాటాన్ని అర్థం చేసుకొని నివేదిక పెట్టాలని , పాత జీతాలు వేయాలని డిమాండ్ చేశారు. మూడో రోజు కొనసాగుతున్న రిలే దీక్షలు దాదాపు 1000 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పిఆర్సి సాధన సమితి కన్వీనర్ ఈశ్వరరావు తదితర నేతలు పాల్గొన్నారు.

# విశాఖలో ఆస్తిపన్ను-చెత్తపన్ను బాదుడు పుస్తకావిష్కరణ

విశాఖపట్నం విశాఖ మధిలపాలెం సీపీఎం కార్యాలయంలో ఈరోజు ఆస్తిపన్ను చెత్తపన్ను బాదుడు అనే పేరుతో పుస్తకావిష్కరణ సీపీఎం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంగారాం సీఐటీయు నాయకురాలు మణి నిర్వహించారు ఈసందర్భంగా జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారాం మాట్లాడుతూ ప్రజలపై జీవీఎంసీ బెదిరింపులు ఆపాలని బకాయిలపై జీవీఎంసీ స్వేతపత్రం విడుదల చేయాలని పౌరసేవల

వ్యాపారికరణపై ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని ఇఅంశాలపై త్వరలో అని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు వైసీపీ ప్రభుత్వం విశాఖని పన్నుల నగరంగా మార్చేసిందని చెత్తపన్ను చెలించని ప్రజలపై అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు ప్రజలు ఎవరు చెత్తపన్ను చెలించవదని పిలుపునిచ్చారు ఇకార్యక్రమంలో పలువురు సీపీఎం,సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు

# జాతీయ స్థాయి ఆస్తుల్లో బీజేపీ.. ప్రాంతీయ పార్టీల్లో సమాజ్ వాదీ టాప్




**2019-20లో ఆస్తుల వివరాల్ని అసోసియేషన్ ఫర్ డెమెక్రటిక్ రిఫామ్స్..**

**బిజేపికి రూ.4847 కోట్లు ఆస్తులు**

**రెండో స్థానంలో బీఎస్పీకి రూ.693.33 కోట్ల ఆస్తులు**

**మూడో స్థానంలో కాంగ్రెస్ పార్టీకిరూ.588.16 కోట్లు ఆస్తులు**

**ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే.. సమాజ్ వాది పార్టీ రూ.563.47 కోట్ల**

**రెండవ స్థానంలో అధికార టీఆర్ఎస్ రూ.301.47 కోట్లు..**

**మూడో స్థానంలోనూ విపక్ష అన్నాడీఎంకే రూ.267.61 కోట్లతో నిలిచింది.**

న్యూ ఢిల్లీ జనవరి 29 అరచేతిలో అధికారాన్ని పెట్టుకొని ప్రజల బతుకుల్ని ప్రభావితం చేసే రాజకీయ పార్టీల ఆర్థిక మూలాలు ఏరీతిలో ఉన్నాయి? ఎవరికి ఎన్ని ఆస్తులున్నాయి? అప్పుల మాటేంటి? మొత్తంగా ఆస్తులు.. అప్పుల విషయంలో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉంది? జాతీయ పార్టీల వర్సెస్ ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే.. ఎవరెలా ఉన్నారు? లాంటి ఎన్నో ప్రశ్నలకు తన తాజా నివేదికతో సమాధానాలు ఇచ్చేసింది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్. ఈ సంస్థ తయారు చేసిన నివేదికలో ఏడు జాతీయ పార్టీలు.. 44 ప్రాంతీయ పార్టీల ఆస్తుల వివరాల్ని సేకరించి..విశ్లేషించింది.జాతీయ పార్టీల విషయానికి వస్తే ఏడు పార్టీల ఆస్తుల వివరాల్ని సేకరించింది. ఇందులో బీజేపీ తిరుగులేని రీతిలో ఆస్తులు ఉన్నాయి. 2019-20లో తమ ఆస్తుల వివరాల్ని రూ.4847 కోట్లుగా ప్రకటించింది. రెండో స్థానంలో బీఎస్పీ నిలవగా.. దేశాన్ని అత్యధిక కాలం పాటు ఏలిన కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో నిలిచింది. బీఎస్పీకి రూ.693.33 కోట్ల ఆస్తులు ఉంటే.. కాంగ్రెస్ పార్టీకిరూ.588.16 కోట్లు ఉన్నట్లుగా పేర్కొన్నారు.ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే.. విపక్షంలో ఉన్న సమాజ్ వాదీ పార్టీ రూ.563.47 కోట్లతో ముందు వరుసలో ఉండగా.. తర్వాతి స్థానంలో అధికార టీఆర్ఎస్ రూ.301.47 కోట్లు.. మూడో స్థానంలోనూ విపక్ష అన్నాడీఎంకే రూ.267.61 కోట్లతో నిలిచింది. ఇదిలా ఉంటే ఏడు జాతీయ పార్టీల ఆస్తుల మొత్తం రూ.6988.57 కోట్లు అయితే 44 ప్రాంతీయ పార్టీల ఆస్తులు మొత్తం రూ.2219.38 కోట్లుగా ఉండటం గమనార్హం. పార్టీలు ప్రకటించిన ఆస్తుల్లో డిపాజిట్ల విషయానికి వస్తే ఆసక్తికర గణాంకాలు కనిపించాయి.జాతీయ పార్టీల్లో బీజేపీ రూ.3253 కోట్లు.. బీఎస్పీ రూ.618.86 కోట్లుగా ఉండగా.. ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే.. సమాజ్ వాదీ రూ.434.21 కోట్లు ఉండగా.. టీఆర్ఎస్ రూ.256.01 కోట్లు.. డీఎంకే రూ.162.42 కోట్లు.. శివసేన రూ.148.46 కోట్లు.. బీజేపీ రూ.119.42 కోట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఇక.. రాజకీయ పార్టీల అప్పుల విషయాన్ని చూస్తే.. ఏడు జాతీయ.. 44ప్రాంతీయ పార్టీల అప్పులు రూ.134.93 కోట్లుగా లెక్క తేల్చారు.జాతీయ పార్టీలు రూ.74.27 కోట్ల అప్పుల్ని చూపిస్తే.. అందులో ఒక్క కాంగ్రెస్ పార్టీ అప్పే రూ.49.55 కోట్లుగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే 44 పార్టీల అప్పు రూ.60.66 కోట్లు ఉన్నట్లు గుర్తించారు.

# ఎక్సైజ్ పోలీసులపై సారా వ్యాపారుల దాడి

కాకినాడ జనవరి 29, (న్యూస్ పల్స్ః)తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు ఎక్సైజ్ పోలీసులపై సారా వ్యాపారులు దాడి జరిపారు. ఈఘటనలో కానిస్టేబుళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో నాటుసారా బట్టీల పై దాడులు కు వెళ్ళిన ఎక్సైజ్ పోలీసులపై నాటు సారా తయారీ దారులు దాడులకు తెగబడ్డారు. కానిస్టేబుళ్ళకు గాయాలు అవడంతో వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని అమలాపురం ఎక్సైజ్ అడిషనల్ సూపర్డెంట్ శ్రీనివాస్ సందర్శించారు. ఆలమూరు యస్.ఐ. శివ ప్రసాద్ ఆస్పత్రికి చేరుకొని విచారణ జరిపి నిందితులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# జనవరి 31 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకుశ్రీ పురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు

తిరుమల, జనవరి 29 కర్ణాటక సంగీత పితామహులు శ్రీ పురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు టిటిడి దాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకుతిరుపతి, తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఈ కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మొదటిరోజైన జనవరి 31న సోమవారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు హరిదాస రంజని పేరుతో కళాకారులతో భజన సంగీత కార్యక్రమం, పండితులతో ధార్మికోపన్యాసాలు జరుగుతాయి. అదేవిధంగా, తిరుమల ఆస్థాన మండపంలో జనవరి 31న సోమవారం ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగరసంకీర్తన కార్యక్రమాలు, పురందర సంకీర్తనమాల, వివిధ పీఠాధిపతుల మంగళాశాసనాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండవ రోజైన ఫిబ్రవరి 1న మంగళవారం ఉదయం 6 గంటలకు అలిపిరి చెంత పురందరదాసుల విగ్రహానికి పుష్పమాల సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం వద్దగల వైభవోత్సవ మండపానికి శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆరాధనా మహోత్సవాల్లో భాగంగా శ్రీ పురందరదాస సంకీర్తనల బృందగానం నిర్వహిస్తారు. చివరిరోజు ఫిబ్రవరి 2న బుధవారం ఉదయం 6 నుండి 9 గంటల వరకు తిరుమల ఆస్థానమండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# నంద్యాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు

**థాంక్యూ సీఎం సార్ అంటూ ర్యాలీ**

నంద్యాల నంద్యాల పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా గా ఏర్పాటు చేసినందుకు విద్యార్థి సంఘాలు మరియు వైయస్ఆర్సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా నంద్యాల ప్రజల చిరకాల వాంఛను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నెరవేర్చినందుకు వారికి నంద్యాల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారుఈ సందర్భంగా నంద్యాల పార్లమెంట్ స్టూడెంట్ యూనియన్స్ వైఎస్ఆర్సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో నంద్యాల పార్లమెంటు జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసినందుకు నంద్యాల ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న ఉన్నారు ముఖ్యంగా నంద్యాల పార్లమెంట్ ను ఎన్నో దశాబ్దాలుగా జిల్లా కావాలని కలగా మిగిలిపోయిందని ఏ నాయకుడు కూడా ముందుకు రాని పరిస్థితి మొట్టమొదటిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్లో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి చరిత్రలో నిలిచి పోయారన్నారు గతంలో చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీని ఎన్టీరామారావు నుండి లాగేసుకుని ఒక్క రోజు కూడా ఎన్టీ రామారావు పేరు పెట్టాలన్న ఆలోచన కూడా చేయలేదని పరిస్థితి ప్రజలు కూడా చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని ఎలక్షన్ సమయంలో మాత్రం ఎన్టీ రామారావు పేరును వాడుకోవడం జరుగుతుంది కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ పేరును జిల్లాగా ప్రకటించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరిగింది గతంలో కూడా ఎంతో మంది గొప్ప నాయకుల పేర్లను జిల్లాలో ప్రకటించడం జరిగిందని నేడు కూడా ఎన్టీ రామారావు పేరును ప్రకటించినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి రామ్ రెడ్డి, మణికంత రామచంద్రుడు ,రాజు నాయుడు, రియాజ్, గురు లోకేష్ ,దినేష్, స్టూడెంట్స్ యూనియన్స్ మరియు వై ఎస్ ఆర్ సి పి స్టూడెంట్స్ యూనియన్స్ వైఎస్ఆర్సిపి యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు

# ఇక ఎస్మానేనా...?

విజయవాడ, జనవరి 29, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పీఆర్సీపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ఎస్మా ప్రయోగించే అంశంపై ఆలోచన చేస్తోంది ప్రభుత్వం. కీలక శాఖలు కూడా ఉద్యమంలోకి వెళ్తామంటూ స్పష్టం చేయడంతో అలెర్టయింది ప్రభుత్వం. సమ్మె దిశగా అడుగులేస్తోన్న ఆర్టీసీ, విద్యుత్, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులను ఎలాగైనా దారికి తీసుకురావాలని భావిస్తోంది.ఎస్మా ప్రయోగించే అంశంపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. ఏయే శాఖల్లోని ఉద్యోగులపై ఎస్మా ప్రయోగించవచ్చునే అంశంపై శాఖల వారీగా జాబితాను సిద్ధం చేస్తోన్న అధికారులు.అత్యవసరమైతేనే ఎస్మా ఉపయోగించాలని అధికారులకు సూచిస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. సమ్మెలను నిషేధిస్తూ ఇటీవలే జీవో జారీ చేసింది విద్యుత్ శాఖ.తాము సమ్మెకు వెళ్లడానికి ఆర్టీసీ ఎండీకి ప్రత్యేక నోటీసు అవసరం లేదని.. సీఎస్కు పీఆర్సీ సాధన సమితి ఇచ్చిన నోటీసు చాలంటున్న ఆర్టీసీ ఉద్యోగులు. ఉద్యమ కార్యాచరణ నోటీసును ప్రభుత్వానికి ఇప్పటికే అందచేశారు వైద్య, విద్యుత్ శాఖ ఉద్యోగులు. ఓవైపు జీతాలు, పెన్షన్ల బిల్లులు ప్రాసెస్కు సహకరించడం లేదు ఉద్యోగులు.4.50 లక్షల బిల్లులకు గానూ.. కేవలం 1.10 లక్షల బిల్లులు మాత్రమే ప్రాసెస్ అయ్యాయంటోంది ఆర్థిక శాఖ.పరిస్థితి చేయిదాటకుండా చూసుకునేలా చర్యలు తీసుకుంటోంది ప్రభుత్వం. ఉద్యమం నుంచి వెనక్కు తగ్గేదే లేదంటున్నారు ఉద్యోగులు.

# ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

విశాఖపట్నం విశాఖ రైల్వే స్టేషన్లలో ప్లాస్టిక్ వినియో గం పై అధికారులు అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు.వాల్తేర్ డిఆర్ ఎం అనూప్ కుమార్ సత్ పతి,రైల్వే అధికారులు విశాఖ రైల్వే స్టేషన్ లో కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.దేశంలో ప్లాస్టిక్ వినియో గం ప్రమాదకరంగా మారిందని,ఈ డివిజన్ లో ప్రయాణికులకు ప్లాస్టిక్ వినియోగం పై అవగాహన వుండాలని కోరారు.ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత బ్యాగ్ లను క్యారీ చేయాలని వాల్తేర్ డిఆర్ఎం అనూప్ కుమార్ సత్ పతి విజ్ఞప్తి చేశారు.

# పరిశ్రమల మంత్రి ఇలాకాలో పరిశ్రమలు తరలిపోవడం సిగ్గుచేటు ఏబీవీపీ



ఆత్మకూరు జనవరి29( ( విభారె) అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆత్మకూర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సోమశిల సెంటర్లో సమగ్ర వంతమైన నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని మరియు విడుదల చేసిన జాబితాలను భర్తీ చేయాలని, నారం పేట దగ్గర ఎంఎస్ఎంఈ పార్క్ పరిశ్రమ తరలి వెళ్ళి పోవడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేశారు.×ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ వైయస్సార్సీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి జనవరిలో నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మాటలు ఈ రోజు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు నిరుద్యోగులు ఈరోజు ఈ ఒక్క ముఖ్యమంత్రి మాటలు నమ్మే పరిస్థితిలో లేరని ఇప్పటికైనా ముఖ్యమంత్రి గారు మేల్కొని సమర్థవంతమైన నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఏబీవీపీ మీ ప్రభుత్వాన్ని ని గద్దె దించడానికి ప్రతిపక్ష పాత్రను పోషిస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లా కోకన్వీనర్ మల్లవరపు అశోక్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్ ను తయారు చేస్తుందని అదేవిధంగా స్థానిక పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఇలాకాలో పరిశ్రమలు తరలి పోవడం సిగ్గుచేటని దీనిపైన వెంటనే మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి గారు స్పందించాలని తెలియజేశారు లేనిపక్షంలో 2024 లో ఆత్మకూరు విద్యార్థి, నిరుద్యోగుల మార్పు కోరుకుంటున్నారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రవికుమార్, కళమంచ్ కన్వీనర్ ధనుష్, కార్యవర్గ సభ్యులు నవీన్, కళ్యాణ్, భరత్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# దళితులను చంపిన వారిని చట్టం ప్రకారం శిక్షించాలి....



డోన్ జనవరి29( ( విభారె) దళితులను చంపిన వారిని చట్టప్రకారం శిక్ష విధించాలని యం ఆర్ పి యస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్య మాదిగ్ డిమాండ్ చేశారు,స్థానిక డోన్ పట్టణంలో అంబేత్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం కౌతాలం మండలం కామవరం గ్రామంలో 27/01/2022 న బి సి, వడ్డె కులానికి చెందిన మల్లికార్జున, రామాంజనేయులు,వీరితో పాటు 20మంది వడ్డెర కులస్తులు,మాదిగ శివప్ప, మాదిగ వీరన్న లను పెట్రోల్ లో యాసిడ్ కారం కలిపి పెట్రోల్ పంపులో పోసుకుని పంటను పిచికారి చేసినట్లు వీరిపై పిచకారి చేసి, వేటకొడవళ్లుతో గొడ్డల్లతో వెంటాడి నరికి చంపి శవాలను ముళ్లకంచె చెట్లు లలోకి ఈడ్చుకొని వెళ్లి శవాలపై పెట్రోల్ పోసి అంటించి క్రూరాతి క్రూరమృగము చంపినారు మరియు నలుగురకు కూడా వేట కొడవళ్ళ తో నరికిన గాయలతో ఆదోని ప్రభుత్వ హాస్పిటల్ లో మరియు కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్ ల లో ట్రీట్ మెంట్ తీసుకొని చున్నారు వీరిలో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉంది వీరిని చంపడానికి ప్రేరేపించిన వ్యక్తులు స్థానిక వైసీపీ నాయకుడు మహేంద్ర రెడ్డి,మరియు స్థానిక బి. జె. పి నాయకులు పురుషోత్తం రెడ్డి వీరిని కూడా యఫ్ ఆర్ ఐ లో చేర్చి వీరిని కూడా చట్టం ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము, మరియు చనిపోయినవారి కుటుంబముల కు పోలీస్ డిపార్ట్మెంట్ పూర్తిగా రక్షణ కల్పించాలి కర్నూలు జిల్లా కలెక్టర్ గారు ఆ గ్రామంను సందర్శించి బాధిత కుటుంబముల కు ఒక్కొక్కరికి 50లక్షలు ఎక్సగ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము, ఇందుకు నిరసనగా ఈరోజు 29/01/2022న,యమ్మార్పీయస్ వ్యవస్థాపకులు గౌరవ శ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు డోన్ అంబేద్కర్ విగ్రహమునకు పూలమాల వేసి నిరసన తెలియ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యమ్మార్పీయస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుపెంట కేశవయ్య మాదిగ యమ్మార్పీయస్ మండలం నాయకులు కె. రామాంజనేయులు,యమ్.యస్.యఫ్ నాయకులు కిరణ్ శాంతిరాజు జి. రామకృష్ణ, జి. మదుశేఖర్, కె. ప్రతాప్, సుంకన్న చిరంజీవి పవన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# ఆత్మహత్య సెల్ఫీ వీడియో..శోధించి కాపాడిన పోలీసులు



**ఆత్మహత్య చేసుకుంటున్నాను అని సెల్ఫీ వీడియో పంపించిన వ్యక్తిని వెతికి మరీ కాపాడి వైద్యశాలకు తరలించిన నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీసులు**

ఆత్మకూరు జనవరి29( ( విభారె)నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో పోలీస్ స్టేషన్ కు మధ్యాహ్నం 12:10 కు మహిళా పోలీసులకు ఓ వీడియో వచ్చింది. ఆ వీడియోలో ఒక వ్యక్తి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తీసి పోస్ట్ చేసిన సెల్ఫీ వీడియో.. వెంటనే ఆ వీడియోను వారు ఆత్మకూరు సిఐ జి వేణుగోపాల్ రెడ్డి గారికి చూపించడంతో సిఐ గారు పట్టణ ఎస్ఐ శివ శంకర్ రావు ను అప్రమత్తం చేయగా ఎస్ ఐ తన సిబ్బందితో ఆ వీడియో తీసి పోస్ట్ చేసిన వ్యక్తిని కనుగొనేందుకు హుటాహుటిన బయలుదేరారు. సెల్ఫీ వీడియో తీసి పంపిన వ్యక్తి పట్టణంలోని మొద్దు పెంచలయ్య గా గుర్తించి అతని ఇంటికి చేరుకున్నారు.. వీడియో పంపిన ఫోను ఇంట్లోనే ఉండగా అతను ఇంట్లో లేడు. అతను సెల్ఫీ వీడియో పోస్ట్ చేసిన విషయం వారి ఇంట్లో వాళ్లకు కూడా తెలియకపోవడంతో పోలీసులు ఇంటి వద్దకు రాగానే వారు కూడా కంగారు పడ్డారు. ఎస్ ఐ శివ శంకర్ రావు తన సిబ్బందిని బంధువులను రెండు బ్యాచ్ లుగా విడగొట్టి పట్టణమంతా గాలింపు చేస్తూ ఉండగా సెల్ఫీ వీడియో తీయబడిన వ్యక్తి పట్టణ శివారులోని ఇటీవలే ఆత్మహత్య చేసుకొని చనిపోయిన అతని భార్య సమాధి వద్ద పడి ఉన్నట్టు సమాచారం వచ్చింది..అందరూ కలిసి అతని కోసం వెతికి కనుగొని వైద్యశాలకు తరలించారు.. సదరు మొద్దు పెంచలయ్య ఇటీవల తన భార్య ఆత్మహత్య చేసుకుంటూ ఉండగా పైశాచికంగా వీడియో తీసి పోస్ట్ చేసిన కేసులో ముద్దాయిగా ఉండి ఇటీవలే జైలు నుండి వచ్చాడు.. ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో రావడంతో హుటాహుటిన అతని కనుగొని కాపాడిన పోలీసుల తీరు హర్షణీయం.. సదరు వ్యక్తి ప్రస్తుతం నెల్లూరు లో చికిత్స పొందుతూ ఉంటాడు.

# టాపర్ నవోదయ కోచింగ్ సెంటర్ ను సీజ్ చేయాలి

ఎమ్మిగనూరు జనవరి29( ( విభారె) పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థి సంఘం ఏ పీ ఎస్ యుఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏ పీ ఎస్ యు తాలూకా కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు లో ఉన్నటువంటి నవోదయ టాపర్ కోచింగ్ సెంటర్లో విద్యార్థులు పాఠశాల సమయంలో పాఠశాలలో ఉండకుండా ఆ కోచింగ్ సెంటర్ లో ఉండటం జరుగుతుంది.ఆ కోచింగ్ సెంటర్ లో ఎటువంటి మౌలిక వసతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు( శానిటైజర్, మాస్క్, సోషల్ డిస్టెన్స్) పాటించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారాని.అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలకు వేలు ఫీజులు వసూలు చేసిన కూడా చాలా మంది విద్యార్థులకు సీట్లు రానటువంటి పరిస్థితులు ఉండడం జరుగుతున్నాయని ఆయన తెలియజేయడం జరిగింది.

# ఇసుక ట్రాక్టర్లు సీజ్

తుగ్గలి:జనవరి29( ( విభారె) ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసినట్లు తుగ్గలి ఎస్.ఐ షామీర్ భాష తెలియజేశారు.శుక్రవారం నిర్వహించిన దాడుల్లో తుగ్గలి మండలం పరిధిలోని నల్లగుండ్ల గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షామీర్ భాష తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుకను సరఫరా చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆరు సినిమాలు 300 కోట్ల బిజినెస్



మాస్ మహారాజా రాకెట్ స్పీడుతో దూసుకుపోతున్నారు. వరుస సినిమాలతో ఆయన మెంటలెక్కిస్తున్నారు. 'క్రాక్' బ్లాక్ బస్టర్ తో మళ్లీ ట్రాక్ లోకి వచ్చేసిన రవితేజ అదే ఊపులో వరుసగా ఆరు చిత్రాలనిలైన్ లో పెట్టేసి ఇండస్ట్రీ వర్గాలకి షాకిచ్చాడు. గతంలో ఇలా స్పీడుని ప్రదర్శించని రవితేజ ఇప్పుడు వరుసగా ఆరు చిత్రాలని బ్యాక్ టు బ్యాక్ లైన్ లో పెట్టడం విశేషం. గత ఏడాది జనవరి 9న విడుదలైన 'క్రాక్' రవితేజ చిత్రాల్లో అత్యధిక వసూళ్లని రాబట్టిన చిత్రంగా నిలిచి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ మూవీ సక్సెస్ ఊపులో వున్న రవితేజ ఏకంగా ఇప్పుడు ఆరు చిత్రాల్లో నటిస్తూ బిజీగా వున్నారు.రమేష్ వర్మ దర్శకత్వంలో 'ఖిలాడీ' చిత్రాన్ని చేస్తున్నారు. ఈ మూవీ చిత్రీకరణ పూర్తి చేసుకుని వచ్చే నెల 11న రిలీజ్ కు రెడీ అయిపోయింది. యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్నఈ మూవీలో రవితేజ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. మీనాక్షీ చౌదరి డింపుల్ హయాతీ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. ఈ మూవీతో రవితేజ బాలీవుడ్ కు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత 'రామారావు ఆన్ డ్యూటీ' చిత్రం చేస్తున్నారు. శరత్ మండవ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీకి రవితేజ వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్ గా కూడా వ్యవహరిస్తున్నారు. దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.ఇక ఇటీవలే సుధీర్ వర్మ డైరెక్షన్ లో సంక్రాంతి సందర్భంగా 'రావణాసుర' చిత్రాన్ని మొదలు పెట్టారు. ఐదుగురు హీరోయిన్ లు నటిస్తున్న ఈ మూవీ మెగాస్టార్ క్లాప్ తో లాంఛనంగా మొదలైంది. ఇందులో లాయర్గా విభిన్నమైన పాత్రలో రవితేజ కనిపించనున్నారు. టైటిల్ తో పాటు ఇందులో రవితేజ పది రకాల గెటప్ లలో కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్ కూడా ట్రేడ్ వర్గాల్లో హాట్ కేక్ లా మారింది. ఇదే ఊపులో స్టూవర్ట్ పురం గజదొంగ టైగర్ నాగేశ్వరరావు బయోపిక్ ఆధారంగా 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రకటించాడు రవితేజ. దీనికి వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగుతో పాటు ఈ మూవీ ఐదు భాషల్లో విడుదల కానుంది.ఇక త్రినాథ రావు నక్కిన తో కలిసి 'ధమాకా' చిత్రం చేస్తున్నారు. ఇందులో రవితేజ పోలీస్ ఆఫీసర్ గా కనిపించబోతున్నారు. దీనిపై కూడా అంచనాలు బారీగానే వున్నాయి. ఇవే కాకుండా మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'వాల్తేరు వీరయ్య'లోనూ ఓ ప్రత్యేక అతిథి పాత్రలో నటిస్తున్నారు. ఇలా వరుసగా ఆరు చిత్రాల్లో నటిస్తూ షాకిస్తున్న రవితేజ వీటితో థియేట్రికల్ బిజినెస్ పరంగాగానూ షాకివ్వబోతున్నారు.ఏకంగా ఈ చిత్రాల ద్వారా దాదాపు 300 కోట్ల మేర బిజినెస్ జరగబోతోందని టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. అంతే కాకుండా ఇందులో ఒక్కో చిత్రానికి రవితేజ 12 నుంచి 14 కోట్లు రెమ్యునరేష్ తీసుకున్నారని తెలిసింది. ఆరు చిత్రాలకు ఒక్కో సినిమాకు 12 కోట్లు అనుకున్నా 72 కోట్లు ఇక్కడే వసూళు చేసేశాడని అంతా షాక్ అవుతున్నారు.

# సెట్లో సందడికి రెడీ అవుతున్న పాన్ ఇండియా స్టార్



దేశ వ్యాప్తంగా పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. కారోనా ఒమిక్రాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో చాలా వరకు భారీ చిత్రాల రిలీజ్ లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆర్ ఆర్ ఆర్ రాధేశ్యామ్ సంక్రాంతికి విడుదల కావాల్సింది. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల ఈ చిత్రాలని అర్థాంతరంగా వాయిదా వేశారు. అయితే కారోనా ఒమిక్రాన్ వైరస్ ల ప్రభావం రిలీజ్ కోసం రెడీగా వున్న చిత్రాలపైనే కాకుండా సెట్స్ పై వున్న భారీ చిత్రాలపై కూడా పడింది. దీంతో చాలా వరకు స్టార్స్ తమ చిత్రాల షూటింగ్ లని నిలిపి వేశారు. కాళీ సమయం చిక్కడంతో కొంత మంది ఇతర దేశాలల్లో విహరిస్తుంటే మరి కొంత మంది స్టార్ లు తమ ఫ్యామిలీతో టైమ్ స్పెండ్ చేస్తున్నారు.పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా తన 'సరార్' మూవీని షూటింగ్ కి బ్రేకిచ్చేసి యూరప్ ట్రిప్ కు వెళ్లారు. ఇటీవలే తన ట్రిప్ ని ముగించుకుని ఇండయా తిరిగి వచ్చేశారు. గత రాత్రి హైదరాబాద్ లో ల్యాండ్ అయిపోయారు. యూరప్ ట్రిప్ పూర్తి కావడంతో హైదరాబాద్ తిరిగి వచ్చేసిన ప్రభాస్ నిర్మాణ దశలో వున్న తన ప్రాజెక్ట్ ల షూటింగ్ లని మళ్లీ తిరిగి ప్రారంభించబోతున్నారట. ఇప్పటికే ప్రభాస్ రెండు పాన్ ఇండియా చిత్రాల షూటింగ్ లని రికార్డు స్థాయి వేగంతో పూర్తి చేశారు. 'రాధేశ్యామ్' కోసం కొంత ఎక్కువ సమయమే పట్టినా 'ఆది పురుష్' చిత్ర షూటింగ్ ని మాత్రం ఆశ్చర్యపోయే విధంగా రికార్డు స్థాయిలో తక్కువ సమయంలోనే పూర్తి చేసేశారు. వీఎఫ్ ఎక్స్ కు భారీ స్కోప్ వున్న మూవీ కావడంతో ఈ మూవీ షూటింగ్ ని ముందుగానే పూర్తి చేసి మిగతా చిత్రాల షూటింగ్ కోసం రెడీ అయిపోయారు.రాధేశ్యామ్ ఆదిపురుష్ చిత్రాల తరువాత సలార్ 'ప్రాజెక్ట్ కె' చిత్రాల్లో నటిస్తున్నారు ప్రభాస్. ఈ రెండు చిత్రాల్లో 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్న 'సలార్' ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో ఈ మూవీని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభాస్ దర్శకుడు ప్రశాంత్ నీల్ భావిస్తున్నారట. ఆ కారణంగానే యూరప్ ట్రిప్ ముగించుకుని హైదరాబాద్ తిరిగి చేరుకున్నప్రభాస్ ముందుగా 'సలార్' షూటింగ్ ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారట. త్వరలోనే 'సలార్' సెట్స్ లో ప్రబాస్ సందడి చేయడానికి రెడీ అవుతున్నారని చెబుతున్నారు.ఈ మూవీతో పాటే 'ప్రాజెక్ట్ కె' ని కూడా ఆపకుండా పూర్తి చేయాలని ప్రబాస్ భావిస్తున్నారట. సైన్స్ పిక్షన్ థ్రిల్లర్ గా 'ప్రాజెక్ట్ –కె' రూపొందుతోంది. హిమాలయాల్లో వున్న ఓ గుహ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన కథగా ఈ మూవీ సరికొత్త అనుభూతిని ఇవ్వబోతోందని చెబుతున్నారు. 'ఆదిత్య 369' తరహాలో ఆ గుహ నుంచి మరో కాలానికి ప్రయాణించి ప్రభాస్ అండ్ కో ఏం చేశారన్నదే ఈ చిత్ర కథగా వార్తల వినిపిస్తున్నాయి. దీనికి బలాన్ని చేకూరుస్తూ సీనియర్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాస రావు ఈ మూవీకి మెంటర్ గా వ్యవహరిస్తుండటం గమనార్హం.

# రౌడీ స్టార్ సినిమా వున్నట్టా లేనట్టా?

'పుష్ప : ది రైజ్' పాన్ ఇండియా స్థాయిలో ఊహించని విధంగా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలవడంతో సుకుమార్ పార్ట్ 2 ని మరింత పర్ఫెక్ట్ గా కొత్త హంగులతో ఊహించని ట్విస్ట్ లతో తెరపైకి తీసుకురావాలని పార్ట్ 2 ద్వారా ఉత్తరాది ప్రేక్షకుల్ని మరింతగా ఆకట్టుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందు కోసం 'పుష్ప : ది రూల్' స్క్రిప్ట్ లో మార్పులు చేస్తున్నారట సుకుమార్. మార్పులు పూర్తయిన వెంటనే ఈ మూవీని ఫిబ్రవరిలోనే పట్టాలెక్కించాలని ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. ఇదిలా వుంటే ఈ మూవీకి ముందు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ తో ఓ భారీ చిత్రాన్ని చేయబోతున్నానంటూ సుకుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ భారీ చిత్రాన్ని హీరో బన్నీ స్నేహితుడు ఫాల్కన్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తానని ప్రకటించి కూడా చాలా నెలలవుతోంది. అయితే సుకుమార్ 'పుష్ప' ప్రాజెక్ట్ లో పడి ఈ మూవీ ఊసే ఎత్తడం లేదు. ఇక రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కూడా 'లైగర్' హడావిడిలో పడి సుకుమార్ ప్రాజెక్ట్ గురించి పెద్దగా స్పందించడం లేదు. దీంతో ఈ ప్రాజెక్ట్ వున్నట్టా లేనట్టా? అనే అనుమానాలు ఇండస్ట్రీ వర్గాలతో పాటు సినీ ప్రియుల్లోనూ మొదలయ్యాయి. ఇంతకు ముందు ఇలాంటి రూమర్స్ స్ప్రెడ్ కావడంతో ఫాల్క్ క్రియేషన్స్ అధినేత ట్విట్టర్ వేదిగా స్పందించారు.'కొంత మంది చేసే ప్రచారాన్ని నమ్మకండి. మేము ఈ ప్రాజెక్ట్ పై వస్తున్న గాసిప్స్ ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ మూవీ ప్లాన్ లో ఎలాంటి మార్పు లేదు. సుకుమార్ – విజయ్ దేవరకొండల మూవీ చాలా భారీ స్థాయిలో వుండబోతోంది' అని క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.



మేకర్స్ నుంచి ప్రకటన వచ్చి కూడా చాలా కాలమే అవుతున్న నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన ఓ వార్త తాజాగా ఫిల్మ్ సర్కిల్స్ లో వినిపిస్తోంది.విజయ్ దేవరకొండ – సుకుమార్ ఎవరి ప్రాజెక్టుల్లో వారు బిజీగా వున్నారని ఇద్దరి కలయికలో చేయాలని భావించిన ప్రాజెక్ట్ ని పక్కన పెట్టారని ఇక ఈ ప్రాజెక్ట్ లేనట్టేనని వార్తలు వినిపిస్తున్నాయి. 'పుష్ప –2' తరువాత సుకుమార్ హీరో రామ్ చరణ్ తో తదుపరి చిత్రాన్ని చేయడానికి రెడీ అవుతున్నాడు.ఇదే సమయంలో విజయ్ దేవరకొండ మరో సారి పూరి జగన్నాథ్ తో కలిసి 'జనగణమన' చేయబోతున్నాడంటూ వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ – సుక్కు ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం లేదని చెబుతున్నారు. ఎవరి ప్రాజెక్ట్ లు వారికున్నాయి. దీంతో ఇప్పట్లో ఫాల్కన్ క్రియేషన్స్ మూవీ పట్టాలెక్కడం కష్టమని.. ఈ సినిమా పక్కన పడినట్టేనని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.

# కూతురితో కలిసి వార్నర్ డైలాగ్.. పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా... ఫైర్ అన్న అల్లు అర్జున్

ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ను 'పుష్ప' మానియా వదలడం లేదు. ఇప్పటికే ఈ సినిమాలోని.. "ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా" పాటకు కాలు కదిపిన వార్నర్.. శ్రీ వల్లి పాటకు కూడా అదిరిపోయేలా స్టెప్పులేశాడు. అతడి కూతుళ్లు సైతం 'సామి నా సామి' పాటకు తమదైన శైలిలో డాన్స్ చేసి అలరించారు. తాజాగా మరోసారి పుష్ప పట్ల అభిమానం చాటుకున్నాడు ఈ సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్. ఈ సారి... "పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా? ఫైర్" అంటూ డైలాగ్‌తో అలరించాడు. కూతురితో కలిసి హిందీ డైలాగ్‌కు లిప్ సింక్ చేశాడు.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వార్నర్ ఇందుకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. "నా కోసం ఈ డైలాగ్ పూర్తి చేయండి. ఇండియా మొత్తం జాయిన్ అవ్వాలి. సరిగా లిప్ సింక్ చేయలేకపోయాను సారీ"అంటూ క్యాప్షన్ జతచేశాడు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వార్నర్ భార్య కాండిస్ వార్నర్.. కూతురిని ఎంకరేజ్ చేస్తూ 'గో ఇండీ' అంటూ కామెంట్ చేశారు. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సైతం ఈ వీడియోపై స్పందించాడు. ఫైర్ ఎమోజీలను జతచేశాడు. కాగా వార్నర్ ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆడాడు. ఇక ఐపీఎల్ మెగా వేలం-2022 నేపథ్యంలో అతడు ఆక్షన్‌లోకి రానున్నాడు. సన్‌రైజర్స్‌కు టైటిల్ అందించిన వార్నర్‌ను ఆ జట్టు రిటైన్ చేసుకోలేదన్న సంగతి తెలిసిందే. ఇక టీ20 వరల్డ్‌కప్-2021 టోర్నీలో అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అందుకున్న వార్నర్ భాయ్ కోసం ఈసారి వేలంలో ఫ్రాంఛైజీల మధ్య పోటాపోటీ నెలకొనే అవకాశం ఉంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**